# అగ్రనేత

తెలుగు దిన పత్రిక

TELTEL/2015/66279

రంగారెడ్డి | సంపుటి: 10 సంచిక :50 | ఎడిటర్ : ఉప్పుగల్ల సంతోష్ కుమార్ | తేది: ఆదివారం 20-04-2025 | పేజీలు:4 వెల: 2.00


## టిడిపి స్క్రిప్ట్ చదువుతున్న విజయసాయి

విజయవాడ,ఏప్రిల్19: మాజీ ఎంపీ విజయసాయిరెడ్డి నోట టిడిపి పలుకులు వస్తున్నాయని, వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నేత, మాజీ ఎమ్మెల్యే కోరుముట్ల శ్రీనివాస్ సంచలన ఆరోపణలు చేశారు..వైసీపీ ఎంపీ మిథున్ రెడ్డితో పాటు విజయవాడలోని సిట్ విచారణ కార్యాలయం దగ్గరకు వచ్చిన కోరుముట్ల శ్రీనివాస్ ఈ వ్యాఖ్యలు చేశారు. విజయసాయిరెడ్డి మా పార్టీ నుంచి బయటకు వెళ్లిన వ్యక్తి.. ఆయన టీడీపీ స్క్రిప్ట్ చదువుతున్నాడు అని ఆరోపించారు.. అ యితే, వైఎస్ జగన్ కు సన్నిహితంగా ఉండే వారిపై బురద చల్లాలనే ఉద్దేశ్యంతో ఎంపీ మిథున్ రెడ్డికి సిట్ నోటీసులు ఇచ్చిందని విమర్శించారు.. సిట్ కావాలనే ఇదంతా చేస్తోందన్నారు. కూ టమి ప్రభుత్వంలోనే గుడులు, బడుల దగ్గర బెల్ట్ షాపులు పెరిగాయని టీ-డీపీ తిరువూరు ఎ మ్మెల్యే కొలికపూడి శ్రీనివాస్ చెప్పారని వ్యాఖ్యానించారు.. నేరుగా టీడీపీ ఎమ్మెల్యేనే కూటమి ప్ర భుత్వం తీరుపై విమర్శలు చేసిన పరిస్థితి రాష్ట్రంలో ఉందన్నారు.. గత ప్రభుత్వంలో లిక్కర్ అ మ్మకాలపై కాదు.. సిట్ విచారణ కూటమి ప్రభుత్వంలో లిక్కర్ వ్యాపారంపై చేయాలని డిమాండ్ చేశారు.

# హైదరాబాద్ ఎమ్మెల్సీ ఎన్నికలపై బీఆర్ఎస్ సంచలన నిర్ణయం..



హైదరాబాద్,గ్రేటర్ హైదరాబాద్ లోని పార్టీ నేతల సమావేశంలో కేటీఆర్ మాట్లాడుతూ.. గ్రేటర్ పరిధిలో ఏ ఎన్నికలు జరిగినా మనమే గెలిచే వాళ్ళం.. మొన్న 2023లో కూడా ఔటర్ రింగ్ రోడ్ లోపల అన్ని స్థానాలు మనమే గెలిచాం..హైదరాబాద్ వాళ్ళు అభివృద్ధి కోరుకున్నారు కాబట్టి మనల్ని గెలిపించారు.. ఔటర్ అవతల ఉన్న వాళ్లు కాంగ్రెస్ మాటలకు మోసపోయారు అని పేర్కొన్నారు. ఇప్పుడు కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత అరాచకం చేస్తుంది.. హైడ్రాతో పేదలను తీవ్ర ఇబ్బందులు పెడుతున్నారు.. ఆరు గ్యారెంటీలకు డబ్బులు లేవు అంటూనే.. మూసి సుందరీకరణ చేస్తాను అంటున్నారు.. ఎన్నికలు ఎప్పుడు వచ్చినా తుఫాను వాతావరణంలో బీఆర్ఎస్ గెలుస్తుందన్నారు. ఇక, సందట్లో సడెమియా లాగా బీజేపీ వాళ్ళు ఉన్నారు అంటూ కేటీఆర్ ఆగ్రహం వ్యక్తం చేశారు.ఇక, కేంద్రంలో ఒక సహాయ మంత్రి, మరో నిస్సహాయ మంత్రి ఉండి ఎలాంటి లాభం లేదు అని కేటీఆర్ ఎద్దేవా చేశారు. కంచె గచ్చిబౌలి భూముల వెనుక బీజేపీ ఎంపీ ఉన్నాడంటే.. అందరూ ఎంపీలు భుజాలు తడుముకుంటున్నారు.. బయటకు వచ్చి బీజేపీ ఎంపీలు నన్ను తిడుతున్నారు.. సోనియా, రాహుల్ గాంధీల మీద చార్జ్ షీట్ వేస్తే దేశవ్యాప్తంగా ఉన్న కాంగ్రెస్ వాళ్ళు ఆందోళన చేశారు.. కానీ, రేవంత్ రెడ్డి మాత్రం మాట్లాడలేదు.. బీజేపీ, నరేంద్రమోడీతో చోట భాయ్- బడా భాయ్ బంధం ఉంది కాబట్టే రేవంత్ మాట్లాడడం లేదని కేటీఆర్ ఆరోపించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటింగ్ లో పాల్గొనే అంశంపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఇప్పుడు జరగబోయే ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఎవరికీ ఓటు వేయొద్దు అన్నారు. ఆ రోజు ఎన్నికల్లో పాల్గొనవద్దు.. ఎవరూ ఓటుకు వెళ్లకుండా విప్ కూడా ఇస్తామన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు ఉన్న మన ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, కార్పొరేటర్లు ఎవరూ ఓటు వేయడానికి వెళ్లొద్దని సూచించారు. ఎవరైనా విప్ ధిక్కరించి ఓటింగ్ కు వెళితే వారిపై చర్యలు తీసుకుంటాం.. ఓటు ఉన్న వాళ్లకు విప్ ఇవ్వాలని తలసాని శ్రీనివాస్ యాదవ్, సబిత ఇంద్రారెడ్డిలను కేటీఆర్ కోరారు.

# ప్రపంచపటంలో తెలంగాణను నెంబర్ వన్ గా నిలుపుదాం

టోక్యో : తెలంగాణ అభివృద్ధిలో అందరి సహకారం అవసరమని, ఎవరికి చేతనైనంత వారు చేయగలిగింది చేస్తే ప్రపంచంతోనే మనం పోటీ పడొచ్చని జపాన్ లోని ప్రవాసాంధ్రులకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పిలుపునిచ్చారు. తెలంగాణలో డ్రై పోర్ట్ ఏర్పాటు చేసుకోబోతున్నామని,అందరూ తలో చేయి వేస్తే ప్రపంచంతో పోటీ పడేలా తెలంగాణను అభివృద్ధి చేసుకుందామన్నారు. జపాన్ పర్యటనలో ఉన్న ఆయన నేడు జపాన్ తెలుగు సమాఖ్య ఏర్పాటు చేసిన 'తెలుగు వెలుగు పండుగ సంబరాలు' కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. తెలంగాణ పోటీ అమరావతి , బెంగళూరు, ముంబయి, చెన్నైతో కాదని, లండన్, టోక్యో వంటి అభివృద్ధి చెందిన నగరాల తోనేనని అన్నారు.తెలంగాణలో పెట్టుబడులు పెరగాలి, పరిశ్రమలు పెరగాలి, ఉద్యోగ ఉపాధి అవకాశాలు పెంచాలనేదే మా ప్రభుత్వ ఉద్దేశమని రేవంత్‌రెడ్డి అన్నారు. తెలంగాణలో ఐటీ, ఫార్మా రంగంలో సాధించాల్సినంత ప్రగతి సాధించామని ఇప్పుడు పరిశ్రమలను తెచ్చుకోవాల్సిన అవసరం ఉందన్నారు.

మూసీ ప్రక్షాళనకూ అడ్డుపడుతున్నారు..

బిఆర్ఎస్ ను టార్గెట్ చేస్తూ మూసీ ప్రక్షాళనకు అడ్డుపడుతున్నారని రేవంత్ విమర్శించారు%ొ% ఢిల్లీలో కాలుష్యంతో అన్ని సంస్థలకు సెలవులు ఇస్తున్న పరిస్థితి ఉన్నదని, కేవలం కాలుష్యంతో ఢిల్లీ స్థంభించే పరిస్థితి ఉంటే మనం గుణపాఠం నేర్చుకోవాల్సిన అవసరం ఉందన్నారు. అందుకే హైదరాబాద్‌లో మూసీ ప్రక్షాళన చేయాలని తాను చెబుతున్నానని, మూసీ ప్రక్షాళన, మెట్రో



విస్తరణ, రీజనల్ రింగ్ రోడ్, రేడియల్ రోడ్స్ తెలంగాణ పురోగతికి అత్యంత కీలకమైన అంశాలు కాబోతున్నాయన్నారు. సొంత ప్రాంతాన్ని అభివృద్ధి చేసుకోవడంలో ఉన్న ఆనందం ఏమిటో మీకు తెలుసని మీ ఆలోచనలను రాష్ట్ర ప్రభుత్వంతో పంచుకోవాలని పిలుపునిచ్చారు. టోక్యోలో అభివృద్ధి చేసిన రివర్ ఫ్రంట్ పరిశీలించామని అన్నారు. నీరు, మన సంస్కృతికి, అభివృద్ధికి ప్రతీక అని అన్నారు

# విశాఖ మేయర్‌పై నెగ్గిన అవిశ్వాస తీర్మానం...

విశాఖ : విశాఖపట్నం గ్రేటర్ విశాఖ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ పీఠాన్ని కూటమి కైవసం చేసుకుంది. విశాఖ మేయర్ గొలగాని హరివెంకట కుమారిపై ప్రతిపాదించిన అవిశ్వాస తీర్మానంలో అధికార పక్షం నెగ్గింది.మేయర్ పై అవిశ్వాస తీర్మానానికి వ్యతిరేకంగా 74 మంది సభ్యులు ఓట్లు వేయడంతో హరివెంకట కుమారి మేయర్ పీఠాన్ని కోల్పోయారు. దాంతో వైసీపీ నుంచి వైసీపీకి విశాఖ మేయర్ పీఠం దూరమైంది. ఓటింగ్ కు వైసీపీ సభ్యులు దూరంగా ఉన్నారు.కూటమి సభ్యులు త్వరలో విశాఖ మేయర్ ను ఎన్నుకోనున్నారు. కోరం సరిపోవడంతో ఇంచార్జ్ సమావేశం నిర్వహించారు. వైసీపీ నుంచి కూటమిలో చేరిన కార్పొరేటర్లు సైతం అవిశ్వాసంపై వ్యతిరేకంగా ఓటు వేయడంతో కూటమి తన పంతం నెగ్గించుకుంది. మరోవైపు మేయర్పై అవిశ్వాస తీర్మానం ఓటింగ్ ఉండటంతో జీవీఎంసీ ఆఫీసు వద్ద భారీగా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకుండా జాగ్రత్తలు తీసుకున్నారు.

పంతం నెగ్గించుకున్న కూటమి నేతలు

గత కొన్ని రోజులుగా విశాఖ మేయర్ పీఠంపై నెలకొన్న సస్పెన్స్ వీడింది. కొందరు వైసీపీ కార్పొరేటర్లు కూటమిలో చేరడంతో రాజకీయ సమీకరణాలు మారిపోయాయి. దాంతోవిశాఖ మేయర్పై అవిశ్వాసం పెట్టారు. దాదాపుగా 30 మంది జీవీఎంసీ కార్పొరేటర్లు కూటమి పార్టీలలో చేరి మద్దతు ప్రకటించారు. దాంతో యాదవ సామాజిక వర్గానికి చెందిన గొలగాని హరి వెంకటకుమారి మేయర్ పీఠం నుంచి తప్పుకోవాల్సి వచ్చింది. శనివారం నిర్వహించిన కౌన్సిల్ సమావేశానికి కావాల్సిన కోరం ఉండటంతో ఇంచార్జ్ సమావేశం నిర్వహించి, మేయర్ పై అవిశ్వాసంపై ఓటింగ్ నిర్వహించగా.. మద్దతుగా 74 ఓట్లు రావడంతో వైసీపీ మేయర్ పీఠాన్ని కోల్పోయింది. తమ గెలుపుతో కూటమి నేతలు సంబరాలు చేసుకుంటున్నారు.కొందరు కార్పొరేటర్లు కేరళకు వెళితే వారి ఒప్పించి మరీ కూటమిలో చేర్చుకున్నారు. అయితే కార్పొరేటర్లను బెదిరించి, డబ్బు ఆశ చూపించి తమ వైపు తిప్పుకున్నారని వైసీపీ నేతలు ఆరోపిస్తున్నారు. పలువురు కార్పొరేటర్లను మలేషియాకు పంపించారు. నేడు ఓటింగ్ ఉన్నందున శుక్రవారం అర్ధరాత్రి ప్రత్యేక విమానంలో విశాఖకు తిరిగి రప్పించారు. ఓటింగ్



లో పాల్గొన్న కార్పొరేటర్లు మేయర్ పై అవిశ్వాసానికి మద్దతుగా ఓట్లు రావడంతో జీవీఎంసీ మేయర్ పీఠం వైసీపీ చేజారింది. అవిశ్వాసంపై ఓటింగ్ జరుగుతున్న జీవీఎంసీ ఆఫీసులోకి కూటమి కార్పొరేటర్లు, ఎక్స్ ఆఫీషియో సభ్యులతో పాటు కూటమి నేతలను లోపలికి అనుమతించడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

ఓటింగ్కు ముందు బలాబలాలు

వైఎస్సార్సీపీ 58, టీడీపీ 29, జనసేన 3, బీజేపీ 1, సీపీఐ 1, సీపీఎం 1, ఇండిపెండెన్స్ 4, ఖాళీలు 1,జీవీఎంసీలో 98 మంది కార్పొరేటర్లు ఉండగా, 14 మంది ఎక్స్ ఆఫీషియో సభ్యులు ఉన్నారు. టీడీపీకి 11 మంది సభ్యులు.. వీరిలో 8 మంది ఎమ్మెల్యేలు, ఇద్దరు ఎంపీలు, ఒక ఎమ్మెల్సీ ఉన్నారు. వైసీపీకి ముగ్గురు ఎక్స్ అఫీషియో సభ్యులు.. ఎంపీ గొల్ల బాబురావు, ఇద్దరు, ఎమ్మెల్సీలు పండుల రవీంద్రబాబు, కుంభ రవిబాబు ఉన్నారు. ఎక్స్ అఫీషియో సభ్యులతో కలిపి మొత్తం జీవీఎంసీ సభ్యుల సంఖ్య 97+14= 111 అవుతుంది. ఈ లెక్కన జీవీఎంసీలో అవిశ్వాస తీర్మానం నెగ్గేందుకు 2/3 మెజారిటీ కావాలి. అంటే 74 మంది సభ్యులు తీర్మానానికి మద్దతుగా ఓటు వేయాలి. ఎక్స్ అఫీషియో సభ్యులతో కలిపి వైసీపీ మొత్తం బలం 61 కాగా, ఎక్స్ అఫీషియో సభ్యులతో కలిపి కూటమి బలం 48గా ఉంది. అయితే ఇటీవల కొందరు కార్పొరేటర్లు టీడీపీ, కూటమి పార్టీల్లో చేరడంతో సీన్ రివర్స్ అయింది.

# బీజేపీకి కట్టు బానిసలా కేటీఆర్ పని చేస్తున్నారు



హైదరాబాద్, కేటీఆర్‌కి టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ కౌంటర్ ఇచ్చారు. దొంగల ముఠాలా రాష్ట్రాన్ని పదేళ్లు దోచుకున్న మీరు అవినీతి కేసుల నుంచి తప్పించుకోవడానికి బీజేపీతో లోపాయికారీ ఒప్పందం పెట్టుకున్నారని, పదేళ్లలో రాష్ట్రాన్ని దోచుకోవడమే లక్ష్యంగా పనిచేసిన మీరు, మీ అక్రమాలపై కేంద్రం చర్యలు తీసుకోకుండా నరేంద్ర మోడీకి దాసోహమయ్యారని ఆయన మండిపడ్డారు.మీ బలహీనతలను ఆసరాగా తీసుకున్న బీజేపీ రాష్ట్రానికి న్యాయంగా రావాల్సిన వాటాలను, నిధులను ఇవ్వకుండా అన్యాయం చేసిందని మహేష్ గౌడ్ ఆరోపించారు. సొంత ప్రయోజనాలకే పెద్ద పీట వేసిన మీరు బీజేపీ ప్రభుత్వాన్ని ప్రశ్నించకపోవడంతో రాష్ట్రం అన్ని రంగాల్లో వెనుకబడిందని, పదేళ్లలో కేంద్రంలోని బీజేపీ సర్కార్ ప్రవేశ పెట్టిన బిల్లులకు మద్దతు ఇచ్చింది మీరు కాదా కేటీఆర్ అని ఆయన ఆయన ధ్వజమెత్తారు. పదేళ్లలో మోడీ తీసుకున్న అనాలోచన నిర్ణయాలన్నింటికీ మద్దతిచ్చిన మీరు ఇప్పుడు కాంగ్రెస్‌ను ప్రశ్నించడం హాస్యాస్పదమని, కవితని లిక్కర్ స్కాం నుంచి కాపాడడానికి బీజేపీ కి ఊడిగం చేసినది నిజం కాదా? అని మహేష్ గౌడ్ ప్రశ్నించారు.బీజేపీ కి కట్టు బానిసలా కేటీఆర్ పని చేస్తున్నారని, బీజేపీపై బీఆర్ఎస్ ప్రేమతోనే HCu పై రెండు పార్టీ నేతల దుష్ప్రచారమన్నారు. సంఖ్యా బలం లేని బీజేపీ మీ పార్టీ అండ చూసుకొని పోటీ చేస్తోందని, లోకల్ బాడీ ఎన్నికలో బీజేపీని గెలిపించేందుకే కేటీఆర్ తాపత్రయమన్నారు. పదిహేను నెలల స్వల్ప కాలంలో రికార్డు స్థాయిలో పెద్ద ఎత్తున ఉద్యోగాలివ్వడం, రైతు, మహిళా సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టడం, బీసీలకు 42 రిజర్వేషన్లు ఇవ్వడం, ఎస్సీ వర్గీకరణ చేయడం, పేదలకు సన్న బియ్యం అందించడం వంటి గొప్ప పనులను రేవంత్ రెడ్డి సర్కార్ చేపట్టినా కాంగ్రెస్ ప్రభుత్వాన్ని విమర్శించడం మీ అజ్ఞానానికి నిదర్శనమని ఆయన వ్యాఖ్యానించారు.

# ధరణితో దందాలు చేశారు.. అలాంటి వాటికి భూ భారతిలో చోటు లేదు..

ఆదిలాబాద్: ఆదిలాబాద్ జిల్లాలో భూ భారతి చట్టంపై అవగాహన కార్యక్రమంలో మంత్రి సీతక్క పర్యటించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ధరణితో దందాలు చేశారు..అలాంటి వాటికి ఇప్పుడు భూభారతిలో చోటు లేదన్నారు. గత పదేళ్లుగా ఆక్రమించిన భూ భాగోతం మొత్తం బయటకొస్తుందనే భయం వారికి పట్టుకుంది.. ఇంట్లో కూర్చోని ధరణి తయారు చేశారు.. విచ్చల విడిగా దొంగ వార్తలు ప్రచురిస్తున్నారు.. భూ భారతిలో వాళ్ల ఆగడాలు బయటకు వస్తాయనే అనవసరమైన ఆరోపణలు చేస్తున్నారు.. తప్పుడు వార్తలకు ప్రయార్టీ ఇస్తున్నారు.. ప్రజలు ఆలోచించాలి అని సూచించారు. వాళ్ల లాగా దొంగ మాటలు చెప్పి అధికారంలోకి రాలేదు.. మాది ప్రజల ప్రభుత్వం.. ధరణికి భూ భాతరతికి చాలా తేడా ఉంద అని మంత్రి సీతక్క వెల్లడించింది.అయితే, అధికారులు తప్పుడు పనులు చేయకండి అని మంత్రి సీతక్క కోరారు. గత ప్రభుత్వం వీఆర్ఓలను వాడుకోని వదిలేశారు.. పేదల హక్కులు తీసేసి బడా బాబులకు అనుకూలంగా వాడుకున్నారు.. ఇక, ఆదిలాబాద్ ఉమ్మడి జిల్లాలో కొంత మంది లీడర్లు డిక్టేటర్లుగా వ్యవహరిస్తున్నారు.. మంత్రి వర్గ విస్తరణలో ఉమ్మడి జిల్లాకు ప్రయార్టీ ఉంటదని తేల్చి చెప్పింది. స్థానిక సంస్థల ఎన్నికలు ఉంటాయి.. బీసీ బిల్లు కోసం ఎదురు చూస్తున్నాం అని



పేర్కొనింది. జిల్లాలో ఎన్ని గ్రూపులు ఉన్నా సరే నేను సిన్సియర్ గా పని చేస్తున్నాను.. కొంత మంది తప్పును ప్రశ్నిస్తే వాళ్లకు నచ్చడం లేదు.. ఎంపీ ఎన్నికల్లో 4 లక్షల ఓట్లు తెప్పించాం.. అక్కడక్కడ లీడర్లు వేరే వాళ్లకు పదవు ఇవ్వొద్దని అంటున్నారు.. అలాంటి ఆలోచన తప్పు అన్నారు. రాజకీయం అంటేనే అందరు ఉండాలి.. అప్పుడు పబ్లిక్ లీడర్ గా పేరు వస్తుందని సీతక్క చెప్పుకొచ్చింది.

# బంగ్లాదేశ్‌లో హిందూ లీడర్ హత్య.. భారత్ ఆగ్రహం..




ఢాకా,బంగ్లాదేశ్‌లో హిందువులపై హింస ఆగడం లేదు. హిందూ నాయకుడు భబేష్ చంద్ర రాయ్‌ని కిడ్నాప్ చేసి, హత్య చేయడంపై భారత్ తీవ్రంగా స్పందించింది.మహ్మద్ యూనస్ నేతృత్వంలోని తాత్కాలిక ప్రభుత్వం హిందువులతో సహా అన్ని మైనారిటీలను రక్షించే బాధ్యతను నిర్వర్తించాలని భారత్ పిలుపునిచ్చింది. "బంగ్లాదేశ్‌లో హిందూ మైనారిటీ నాయకుడు శ్రీ భబేష్ చంద్ర రాయ్ అపహరణ, దారుణ హత్యను మేము బాధతో గమనించాము" అని విదేశాంగ మంత్రిత్వ శాఖ అధికారిక ప్రతినిధి రణధీర్ జైస్వాల్ ఒక ప్రకటనలో తెలిపారు." ఈ హత్య బంగ్లాదేశ్ ప్రభుత్వ హయాంలో హిందూ మైనారిటీలను క్రమబద్ధంగా హింసించే విధానాన్ని కలిగి ఉందని, గతంలో ఇలాంటి సంఘటనలకు పాల్పడినవారు శిక్షార్హత లేకుండా తిరుగుతన్నారు. " అని జైస్వాల్ అన్నారు. " ఈ ఘటనను తాము తీవ్రంగా ఖండిస్తున్నామని, సాకులు చెప్పకుండా, తేడాలు చూపకుండా హిందువులతో సహా అన్ని మైనారిటీలను రక్షించాలని బంగ్లా ప్రభుత్వానికి మరోసారి గుర్తు చేస్తున్నామని భారత్ తన ప్రకటనలో పేర్కొంది.గతేడాది, షేక్ హసీనా ప్రధాని పదవి నుంచి దిగిపోయినప్పటి నుంచి హిందువులపై అక్కడి ఇస్లామిస్ట్ రాడికల్స్ దాడులకు పాల్పడుతున్నాయి. హిందువుల ఇళ్లు, ఆస్తులు, దేవాలయాలను టార్గెట్ చేస్తున్నారు. గతేడాది, హిందు సన్యాసి చిన్మోయ్ కృష్ణ దాస్‌ని ఢాకా విమానాశ్రయంలో బలవంతంగా నిర్బంధంలోకి తీసుకున్నారు. అప్పటి నుంచి భారత్ మైనారిటీల భద్రతపై బంగ్లాదేశ్‌ని హెచ్చరిస్తూనే ఉంది.స్థానిక మీడియా ప్రకారం, బుధవారం సాయంత్రం ఉత్తర బంగ్లాదేశ్‌లోని దినాజ్‌పూర్ జిల్లాలోను బసుదేబ్‌పర్ గ్రామంలో తన ఇంటి నుంచి 58 ఏళ్ల భబేష్ చంద్ర రాయ్‌ని బైక్‌పై వచ్చిన నలుగురు వ్యక్తులు కిడ్నాప్ చేసి తీసుకెళ్లారు. అతడిని నరబరి గ్రామానికి తీసుకెళ్లి దాడికి పాల్పడ్డారు. రాయ్ అపస్మారక స్థితిలో ఇంటికి తిరిగి వచ్చారని కుటుంబీకులు స్థానిక మీడియాలో చెప్పారు. ఆ తర్వాత అతడిని దినాజ్‌పూర్ ఆస్పత్రికి తరలించారు. గురువారం అక్కడ ఆయన మరణించినట్లు ప్రకటించారు. ఈ హత్యకు సంబంధించి ఇప్పటి వరకు పోలీసులు అనుమానితుల్ని గుర్తించలేదు.

## కాలేజీ భవనంపై దూకి విద్యార్థి ఆత్మహత్య

సూర్యాపేట,ఏప్రిల్19,కాలేజ్ భవనంపై నుంచి దూకి బీటెక్ విద్యార్థిని ఆత్మహత్యకు పాల్పడింది. ఈ విషాదం సంఘటన సూర్యాపేట జిల్లాలో చోటుచేసుకుంది. చిలుకూరు మండలం గేట్ ఇంజినీరింగ్ కాలేజ్ లో మంచిర్యాల జిల్లా జైపూర్ మండలానికి చెందిన కృష్ణవేణి అనే విద్యార్థిని బీటెక్ చదువుతోంది. శనివారం తెలవారుజామున కాలేజ్ భవనంపై నుంచి దూకి విద్యార్థిని ఆత్మహత్య చేసుకుంది. అయితే, ఆత్మహత్య చేసుకునే ముందు..హాస్టల్ గదిలో తల్లితో కృష్ణవేణి ఉన్నట్లు తెలుస్తోంది. కాలేజ్ యాజమాన్య వేధింపులే ఆత్మహత్యకు కారణమా? లేక కుటుంబ కలహాలేమైనా ఉన్నాయా? అనే కోణంలో పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నారు. ఈ ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

# బాలుడి హత్యపై నిరసనలు.. నిందితుల్ని అరెస్ట్ చేయాలంటూ డిమాండ్



న్యూఢిల్లీ,ఢిల్లీలోని సీలంపూర్‌లో 17 ఏళ్ల కునాల్ అనే బాలుడిని గురువారం సాయంత్రం దుండగులు కత్తులతో పొడిచి చంపారు. పాలు తీసుకురావడానికి వెళ్లి హత్యకు గురయ్యాడు. ఈ ఘటన స్థానికంగా తీవ్ర కలకలం రేపింది. హత్యను నిరసిస్తూ స్థానికులు ఆందోళన చేపట్టారు. ఇక ఈ ఘటనపై ఢిల్లీ సీఎం రేఖా గుప్తా స్పందించారు. బాధిత కుటుంబానికి న్యాయం చేస్తామని.. నిందితులను పట్టుకోవాలని పోలీసులకు ఆదేశించారు.ప్రస్తుతం నిందితులు పరారీలో ఉన్నారు. నిందితులను పట్టుకునేందుకు 10 బృందాలుగా విడిపోయి గాలిస్తున్నారు. అయితే ఈ హత్య ప్రతీకార హత్యగా భావిస్తున్నారు. హత్యకు కుట్రపన్నిన జిక్రా అనే లేడీడాన్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు. మిగతా నిందితుల కోసం గాలిస్తున్నారు. ఇప్పటికే సీసీటీవీ ఫుటేజ్ ఆధారంగా నిందితులను గుర్తించారు. షోయబ్-మస్తాన్ ముఠాకు సంబంధించిన వారిగా పోలీసులు కనుగొన్నారు. గత నవంబర్‌లో జరిగిన కత్తిపోటు ఘటనకు ప్రతీకారంగా ఈ హత్య జరిగినట్లుగా అనుమానిస్తున్నారు. ఆ ఘర్షణలో నిందితుల్లో ఒకడు గాయపడ్డాడు. దానికి కునాలే కారణంగా భావించాడు. అందుకు ప్రతీకారంగా గురువారం కునాల్‌ను హతమార్చారు. జిక్రా ప్రోద్బలంతోనే ఈ హత్య జరిగినట్లుగా పోలీసులు గుర్తించారు.కునాల్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మరణించాడని సీనియర్ పోలీసు అధికారి తెలిపారు. భారతీయ న్యాయ సంహిత సెక్షన్ 103 (హత్య) కింద సీలంపూర్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. సమోసాలు, పాలు కొనడానికి కునాల్ బయటకు వెళ్లి హత్యకు గురయ్యాడని పోలీసులు తెలిపారు. జీటీబీ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న అమ్మమ్మ దగ్గర నుంచి కునాల్ అప్పుడే వచ్చాడని.. అంతలోనే హత్యకు గురయ్యాడని పోలీసులు వెల్లడించారు.

## సంపాదకీయం

ఆదివారం 20-04-2025

# ప్రజా సమస్యలపై పోరాడేదెవరు ?

దేశంలో సమస్య ఏదైనా ఉద్యమించాల్సిన అసవరం ఏర్పడింది. ఆయా వర్గాలు తమ అవస్థలను తెలియ చేసేందుకు ఎక్కడిక్కడ ఉద్యమ రూపంలో ప్రభుత్వాలకు తెలియచేయాల్సి ఉంటుంది. ఎందుకంటే పార్లమెంట్, అసెంబ్లీలు అధికార పార్టీ, విపక్షాల సొంత ఎజెండాలతో నడుస్తున్నాయి. కేంద్రంలో బిజెపి, కాంగ్రెస్ పార్టీలతో పాటు, ఆయా రాష్ట్రాల్లో పాలక,ప్రతిపక్షాలు కూడా సొంత ఎజెండానే అనుసరిస్తున్నాయి. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై క్షేత్రస్థాయి పరిశీలన జరగడం లేదు. కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలపై అందరిదీ ఒకటేదారి. ఈ క్రమంలో జాతీయస్థాయి ఉద్యమం చేస్తేనే విపక్షాలను ప్రజలు నమ్ముతారు. అలాగే ఆయా రాష్ట్రాల్లో ప్రజారంజక పాలన అందిస్తేనే ఇది సాకారం అవుతుంది. తమ రాష్ట్రాల్లో నిరంకుశంగా వ్యవహరిస్తూ వస్తున్న ప్రాంతీయ పార్టీలు కేంద్రంపై యుద్ధానికి కదిలినా ప్రజలు నమ్మరని గుర్తించాలి. ఇడి కేసులపై ధర్నాలు చేస్తున్న కాంగ్రెస్ కూడా అసలు ప్రజా సమస్యలపై పోరాటం చేయడం లేదు. కేవలం తన రాజకీయ లబ్దికి అవసరమైన విషయాలపైనే పోరాటాలను, విమర్శలను ఎంచుకుంటోంది. అయితే ఇవన్నీ పక్కన పెట్టి ఉద్యమం చేయడానికి అడపాదడపా లెఫ్ట్ పార్టీలు రంగంలోకి దిగుతున్నా..వాటి బలం చాలడం లేదు. ఇప్పటికే లెఫ్ట్ పార్టీలతో పాటు, దాని అనుబంధ సంస్థలు,కార్మిక సంఘాలు వివిధరూపాల్లో పోరాటాలు చేస్తున్నాయి. ఆయా రాష్ట్రాల్లో సమస్యలను ఆధారం చేసుకుని ఉద్యమిస్తున్నాయి. ఈ దశలో ఇక ఉమ్మడిగా పోరు చేయడానికి అన్ని పార్టీలను కలుపుకుని పోవడానికి సిద్దం కావాలి. అయితే ఆయా రాష్ట్రాల్లో ఉన్న పరిస్థితుల కారణంగా కొంత వెనకడుగు తప్పడం లేదు. బెంగాల్లో మమతపై పోరాటం చేస్తున్న లెఫ్ట్ పార్టీలకు కాంగ్రెస్‌తో కలసిపోరాడలేక పోతున్నాయి. కేరళలో కూడా అలాంటి పరిస్థితులే ఉన్నాయి. అయితే స్థూలంగా స్థానిక సమస్యలపై పోరాటాలు చేసేలా ఆయా రాష్ట్రాల పరిస్థితులకు అనుగుణంగా నడుచుకోవడం అసవరమని అన్ని పార్టీలు గుర్తించాలి. అయితే ఆయా పార్టీల్లో ఉన్న అనైతక్యతను క్యాష్ చేసుకోవాలని బిజెపి ఊస్తోంది. విపక్ష పార్టీలు పాలిస్తున్నా రాష్ట్రాల్లో నేతల అవినీతిపై కూడా బిజెపి కాచుకుని కూచుంది. ఇవన్నీ కూడా బిజెపికి కలసివచ్చేలా ఉన్నాయి. అయితే సమస్యల ఆధారంగా పోరాడాలని వివిధ పార్టీలు ముందుకు వస్తే ప్రజల మద్దతు తప్పకుండా లభిస్తుంది. ప్రధానంగా రైతాంగ, కార్మిక సమస్యలపై ఉద్యమించాల్సిన అవసరం దేశంలో ఏర్పడింది. ఎందుకంటే పెట్రో, గ్యాస్ ధరలు, నిత్యావసర ధరలు వంటివాటిపై పోరాడాల్సిన అసవరం నిరంతరంగా ఉంది. ఉత్తరాదిలో పది రాష్ట్రాల్లో రైతులు ఆందోళనకు దిగి కేంద్రానికి ముచ్చెమటలు పట్టించారు. గతంలో తమిళనాడు రైతులు కూడా ఢిల్లీ వేదికగా ఆందోళను దిగారు. అయితే రైతుల సమస్యలు పరిష్కరించడంలో కేంద్రం విఫలమయ్యింది. సాగుచట్టాలను వెనక్కి తీసుకున్నా రైతు సంక్షేమానికి ఒక్క గట్టి నిర్ణయం కూడా తీసుకోలేదు. దీనిని ఆసరగా చేసుకుని రైతులను కలుపుకుని ఉద్యమించేందుకు రాజకీయ పార్టీలు ముందుకు వస్తున్నా..వారిలో నిజాయితీ కానరావడం లేదు. మోడీ పదేళ్ల పాలనలో దేశంలోని సామాన్య ప్రజల ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక, రాజకీయ పరిస్థితులు దిగజారాయి. దేశంలో 50 శాతంపైబడి ప్రజానీకం వ్యవసాయంపై ఆధారపడుతున్నారు. అలాంటి వ్యవసాయం సంక్షోభంలోకి నెట్టబడింది. రైతుల ఆదాయాలను రెట్టింపు చేస్తామని ప్రధాని మోడీ హామీలు అటకెక్కాయి. దేశంలో 42 శాతం రైతుల ఆత్మహత్యలు పెరిగాయని అంటున్నారు. గత పదేళ్ల యూపిఎ హయాంలో కాంగ్రెస్ ప్రభుత్వం అనుసరించిన ప్రజా వ్యతిరేక విధానాలను బిజెపి ప్రభుత్వం మరింత దూకుడుగా అమలు చేస్తోందన్న విమర్శలు ఉన్నాయి. వ్యవసాయరంగం సంక్షోభంలో కూరుకు పోయిందన్న ఇమర్శలను రాజకీయ పార్టీలు పట్టించుకోవడం లేదు. దేశంలో రైతుల వద్ద భూములను వివిధ పరిశ్రమల అవసరాల కోసం బలవంతంగా లాక్కొంటున్న తీరును ఎండగట్టాల్సి ఉంది. దేశంలోని 80 శాతం కార్మిక, రైతు, వ్యవసాయ కార్మికులున్నారు. ప్రజాస్వామ్య హక్కులపై దాడి కొనసాగుతోంది. ప్రజలను కుల, మత ప్రాతిపదికన విభజిస్తున్నారన్న విమర్శలు ఉన్నాయి. కులగణన కూడా కేవలం రాజకీయ లబ్ది కోసం తప్ప మరోటి కాదు. నిరుద్యోగం పెరిగింది. ఉన్న ఉద్యోగాలు ఊడి పోతున్నాయి. విద్యా, వైద్యం, ప్రభుత్వ రంగ సంస్థల్లో ప్రైవేటీకరణ బలంగా నాటుకుంది. కార్పొరేట్ శక్తుల ప్రభావం ప్రభుత్వ పాలనలోకి చొచ్చుకొచ్చేందుకు తలుపులు తెరిచారు. మేక్ ఇన్ ఇండియా నినాదంలో పస లేదు. ఉన్న పరిశ్రమలే మూత పడుతున్నాయి. మొత్తంగా దేశంలో ప్రజలందరూ సమస్యలను ఎదుర్కొంటున్నారు. సమస్యలను పరిష్కరించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలం అవుతున్నాయని ప్రజలు గుర్తించారు. ఈ మేరకు దగాపడ్డ వర్గాలను కలుపుకుని ఉద్యమించేందుకు ఉద్యుక్తులు కావాల్సి ఉంది. ప్రజలే తమ సమస్యలను ఎజెండాగా చేయాలి. ఆయా రంగాల్లో ఉన్న వారిని గుర్తించి సమస్యలపై జాతీయస్థాయి పోరాటాలు ఉధృతం చేయాలి. ఇందుకు కలసివచ్చే రాజకీయ పార్టీలను కూడా కలపుకుని పోవాలి. ట్రంప్ సుంకాలు, ఉక్రెయిన్ యుద్ధం ఆర్థిక వ్యవస్థమీద తీవ్ర ప్రభావం చూపుతున్నాయని ఆర్థివేత్తలు అంటున్నారు. వృద్ధిరేటు తక్కువగా ఉండడం, ద్రవ్యోల్బణం అధికంగా ఉండడం, నిరుద్యోగం తీవ్రంగా ఉండడం నేటి పరిస్థితికి అద్దం పడుతోంది. ద్రవ్యోల్బణం కారణంగా నిత్యావసర వస్తువుల ధరలు బాగా పెరిగాయి. మార్కెట్లమీద గుత్తాధిపత్యం కలిగివున్న బడా కార్పొరేట్లు ఆ పెరిగిన ధరలను వినియోగదారుల మీదకు నెడుతున్నారు. పెద్ద సంఖ్యలో ఉద్యోగాలు ఊడిపోతున్నాయి. నిరుద్యోగం మరింత పెరుగుతోంది. పెరిగిన ధరల వలన కొనుగోలు శక్తి తగ్గుతోంది. పెట్రోలు, డీజెల్, గ్యాస్ వినియోగాన్ని తగ్గించకపోవడం వలన రవాణాఛార్జీలు పెరిగి ధరలు అమాంతంగా పెరిగి పోతున్నాయి. విపక్షాలు ఇప్పుడు ఈ సమస్యలపై దృష్టి సారించాలి.

# అమెరికా, ఇరాన్‌ల మధ్య కీలక దశలో అణు చర్చలు



టెహ్రాన్ : అణ్వాయుధాలపై అమెరికా, ఇరాన్‌ల మధ్య చర్చలు చాలా కీలక దశలో ఉన్నాయని ఐరాస అణు నిఘాసంస్థ చైర్మన్ రాఫెల్ మారియానో గ్రాస్సీ పేర్కొన్నారు. గురువారం ఇరాన్‌లోని అంతర్జాతీయ అణుశక్తి సంస్థను సందర్శించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రస్తుతం చర్చలు చాలా కీలక దశలో ఉన్నాయని, ఇరుదేశాల మధ్య ఒప్పందం కుదిరితే ఇరాన్ సమ్మతిని తెలపడంలో ఏజన్సీ కీలకంగా వ్యవహరిస్తుందని అన్నారు. సానుకూల అంశాలపై దృష్టిసారించాలని భావిస్తున్నానని అన్నారు. మంచి ఫలితం వచ్చే అవకాశం ఉందని, ఇప్పటికీ హామీలు ఇవ్వలేదని ఒప్పందం కోసం అన్ని అంశాలను అమల్లోకి తీసుకురావాలని అన్నారు. ఎక్కువ సమయంలేదని, అమెరికాను కూడా సంప్రదిస్తున్నానని అన్నారు.బుధవారం రాత్రి ఇరాన్ చేరుకున్న గ్రాస్సీ ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాఘ్చితో సమావేశమయ్యారు. గురువారం ఇరాన్ అణుశక్తి సంస్థ అధ్యక్షులు మొహమ్మద్ ఎస్లామినితో భేటీ అయ్యారు. అనంతరం ఇరాన్ అణు ప్రాజెక్టులో ప్రదర్శన హాలును సందర్శించారు. సౌదీ అరేబియా రక్షణ మంత్రి ప్రిన్స్ ఖలీద్ బిన్ సల్మాన్ ఇరాన్‌ను సందర్శించిన సమయంలోనే గ్రాస్సీ పర్యటించడం గమనార్హం.గతవారం ఒమన్‌లో జరిగిన మొదటి సమావేశం ముగిసిన సంగతి తెలిసిందే. మరో రౌండ్ చర్చల కోసం ఇరుదేశాలు శనివారంరోమ్‌లో సమావేశం కానున్నాయి.

# టార్గెట్ మోదీ ఇలాకా..! విజయ యాత్రకు సంకల్పం.. గెలుపు గుర్రాలకు టిక్కెట్లు

న్యూఢిల్లీ,కాంగ్రెస్ ఇప్పుడు కష్టకాలంలో ఉంది. ఇది ఎవరైనా ఊహించగలిగేదే. ఏం చేసినా గెలవలేకపోతోంది. అన్ని రాష్ట్రాల్లోనూ తడబడుతోంది. దేశంలో బీజేపీకి ప్రత్యామ్నాయంగా ఉన్న హస్తం పార్టీ ఎందుకు వెనుకబడుతోంది? ఇలాంటి ప్రశ్నలకు సమాధానాన్ని గత కొన్ని రోజుల నుంచి సీరియస్‌గా వెతుకుతోంది హైకమాండ్. వరుస మీటింగ్‌లు, అభిప్రాయసేకరణ.. రోజూ ఇదే జరుగుతోంది. ఇందులో రాహుల్ గాంధీ ఒక స్ట్రాటజీ వర్కవుట్ చేశారు. మూడు గుర్రాల కథ చెప్పారు. గుజరాత్ నుంచే గెలుపు యాత్ర షురూ చేద్దామంటున్నారు. ఇంతకీ ఏమిటా స్ట్రాటజీ? వర్కవుట్ అవుతుందా?

గెలుపు గుర్రాలకే టిక్కెట్లు ఇవ్వాలన్న డిమాండ్లు

రైట్ చూశారుగా.. రాహుల్ గాంధీ డైలాగ్స్.. కాంగ్రెస్ పార్టీలో ఎన్నికల సమయంలో ఏం జరుగుతుందో నిజం ఒప్పుకున్నారు. రేసు గుర్రాలను బరాత్‌కు, పెళ్లి ఊరేగింపు గుర్రాలను రేసుకు పంపుతున్నామని. అందుకే ఓడిపోతున్నామంటున్నారు. నిజానికి ఇది రాహుల్ గాంధీ మాట కాదు. కాంగ్రెస్ కార్యకర్తలతో ఆయన మీటింగ్ లో పాల్గొన్నప్పుడు వాళ్లు చెప్పిందే. రియలైజ్ అవ్వాలి. గెలుపు గుర్రాలకే టిక్కెట్లు ఇవ్వాలన్నది వారి మాట. నిజానికి గతేడాది సేమ్ రేస్ గుర్రం డైలాగ్ రాహుల్ గాంధీ నోటి నుంచి వచ్చింది. ఈ మధ్యలో మహారాష్ట్ర, హర్యానా ఎన్నికలు జరిగాయి. అక్కడ మరి రేసు గుర్రాలకు టిక్కెట్లు ఇవ్వలేదా? ఓడిపోయారెందుకు? ఇలాంటి ప్రశ్నలు వస్తున్నాయి.

ఎలా గెలవాలన్న విషయాలపై సీరియస్ మీటింగ్స్

అయితే గత కొన్ని రోజులుగా కాంగ్రెస్ పార్టీ ఈ వరుస ఓటముల నుంచి ఎలా గట్టెక్కాలన్న విషయాలపై సీరియస్‌గా మీటింగ్‌లు పెడుతున్నారు. అహ్మదాబాద్‌లో ఏఐసీసీ సమావేశంలో ఎలా ముందుకెళ్లాలో ఒక రోడ్ మ్యాప్ క్రియేట్ చేశారు. ఇక పార్టీలో రేసు గుర్రాలకే టిక్కెట్లు ఇవ్వాలని, ట్రెండింగ్‌లో ఉన్న వారికే ఫండింగ్ అంటున్నారు. ఇప్పటికే చాలా సమయం గడిచిపోయింది. అయితే వచ్చే లోక్ సభ ఎన్నికల నాటికి కథ మార్చాలని, మధ్యలో జరిగే రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల్లో సత్తా చాటే వ్యూహాలు రెడీ చేస్తున్నారు రాహుల్ గాంధీ. మరి అవన్నీ వర్కవుట్ అవుతాయా?

డీసీసీల దగ్గర్నుంచే మ్యాటర్ షురూ

దేశ రాష్ట్రాల రాజకీయాల గురించి ఎన్ని మాట్లాడుకున్నా.. ఎంత చేసినా.. ఎన్ని స్పీచులు ఇచ్చినా.. ఎవరెవరినో విమర్శించినా.. చివరకు బూత్ లెవెల్‌లో పది మందిని ప్రభావితం చేసి, తీసుకెళ్లి ఓట్లు వేయించే వాళ్లే అవసరం. ఇప్పుడు వారినే నమ్ముకోవాలని కాంగ్రెస్ అనుకుంటోంది. బూత్ లెవెల్ నుంచి బీజేపీ ఫాలో అవుతున్న వ్యూహాలను అందిపుచ్చుకోవడంలో కాంగ్రెస్ బాగా వెనుకబడింది. ఇన్నాళ్లకు రియలైజ్ అయిందంటున్నారు. అందుకే డీసీసీల దగ్గర్నుంచే మ్యాటర్ షురూ కావాలంటున్నారు. టిక్కెట్ల కోసం పార్టీలో ప్రొడక్టివ్ కాంపిటీషన్ ఉండాలి గానీ.. నష్టపరిచేలా పోటీ ఉండకూడదంటున్నారు. అంతే కాదు.. కాంగ్రెస్ పార్టీలో టిక్కెట్లు ఎలా వస్తాయో కూడా రాహుల్ గాంధీ నిజం చెప్పి ఇన్నాళ్లూ జరుగుతున్న తప్పును కార్యకర్తల దృష్టికి తీసుకొచ్చారు. అంతా ఖుల్లం ఖుల్లా.

గట్టెక్కడం సులువే అంటూ శ్రేణుల్లో రాహుల్ జోష్

నియోజకవర్గాల్లో కాంగ్రెస్ టిక్కెట్ ఎవరికి వస్తుందో డీసీసీలకు కూడా తెలియదని, ఏదో ఉరుము ఉరిమినట్లుగా ఆకాశం నుంచి ఊడిపడుతుందంటూ నిజం ఒప్పుకున్నారు. ఇదే కాదు.. ఏప్రిల్ 16న గుజరాత్ లో జరిగిన మీటింగ్ లో రాహుల్ మరో సంకల్పం తీసుకున్నారు. బీజేపీ ఆర్ఎస్ఎస్ ను దేశంలో ఓడించాలంటే.. అది గుజరాత్ నుంచే మొదలవ్వాలన్నారు. కాంగ్రెస్ ప్రస్థానమే గుజరాత్ నుంచి మొదలైందని, గాంధీ, పటేల్ పుట్టిన గడ్డ నుంచే రీస్టార్ట్ అవ్వాలని గుర్తు చేశారు. గుజరాత్ లో డీమోరలైజ్ అయ్యామని, కానీ కలబడుదాం.. నిలబడుదాం. గెలుద్దాం.. గట్టెక్కడం సులువే అంటూ శ్రేణుల్లో జోష్ తీసుకొచ్చే ప్రయత్నం చేశారు.డీసీసీలను జిల్లా కేంద్రం నుంచే నడిపిద్దామని, అహ్మదాబాద్ నుంచి కాదన్నారు. పవర్ ఇవ్వాలి, బాధ్యతలు ఇవ్వాలి. స్వేచ్ఛ ఇవ్వాలంటూ మాట్లాడడంతో కాంగ్రెస్ కు గుజరాత్ లో మంచి రోజులు వచ్చినట్లేనా అన్న చర్చ జరుగుతోంది. కాంగ్రెస్ లో ఈ పరిస్థితి ఒక్క గుజరాత్ లోనే ఇలా లేదు. చాలా రాష్ట్రాల్లో సేమ్ సీన్. అన్ని రాష్ట్రాల్లో ఉత్సాహం పెరుగుతుందా? రాహుల్ స్ట్రాటజీ వర్కవుట్ అవుతుందా? అంటే మారాల్సింది చాలా ఉందన్న వాదన తెరపైకి వస్తోంది.

ఆపరేషన్ కాంగ్రెస్

కాంగ్రెస్‌ను మూడు గుర్రాల కథ విడిచిపెట్టడం లేదు. అసలైన టైమ్ వచ్చే సరికి రేసు గుర్రాలు వెనక్కి.. పెళ్లి ఊరేగింపు గుర్రాలు ముందుకొస్తున్నాయి. ఇక కుంటి గుర్రాల సంగతి చెప్పక్కర్లేదు. మరి దేశవ్యాప్తంగా చేతి రాత మారుతుందా? దశ తిరుగుతుందా? తెలంగాణలో సక్సెస్ ఎలా అయ్యారు.. మిగితా చోట్ల బోల్తా కొట్టారెందుకు? గుజరాత్ లో ఎందుకు గెలవాలనుకుంటున్నారు?

1995 నుంచి గుజరాత్‌లో బీజేపీ గెలుపు

గుజరాత్ అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ 1995 నుంచి 2022 వరకు వరుసగా 7 సార్లు గెలిచింది. కాంగ్రెస్ ఎప్పుడూ బోల్తా కొడుతూనే ఉంది. నిజానికి సుదీర్ఘకాలం ఏదైనా ఒకే పార్టీ అధికారంలో ఉంటే ప్రభుత్వ వ్యతిరేకత ఉంటుంది. కానీ కాంగ్రెస్ పార్టీ పుంజుకోకపోవడంతో అక్కడ మ్యాటర్ మరోలా ఉంది. ఇప్పుడు 2027లో గుజరాత్ అసెంబ్లీ ఎన్నికలు జరగబోతున్నాయి. అందులో గెలుపే లక్ష్యంగా రాహుల్ గాంధీ భారీ స్ట్రాటజీతో ఉన్నారు.

సంఘటన్ సృజన్ అభియాన్ కార్యక్రమం

మొన్నటికి మొన్న ఏఐసీసీ సమావేశాలు అక్కడే పెట్టారు. తాజాగా సంఘటన్ సృజన్ అభియాన్ కార్యక్రమాన్ని కూడా గుజరాత్ నుంచే షురూ చేశారు. దీనికి లెక్క ఉంది. ఎందుకంటే గుజరాత్ లో 30 ఏళ్లుగా బీజేపీ అధికారంలో ఉంది. ఆ లెక్కలన్నీ ఇప్పుడు మార్చాలనుకుంటున్నారు. అందుకే ఆపరేషన్ గుజరాత్ నడుస్తోంది.



కాంగ్రెస్‌లో ఇంటర్నల్‌గా చాలా ఇష్యూస్

గుజరాత్ సరే.. మరి మిగితా రాష్ట్రాల్లో కాంగ్రెస్ పరిస్థితి ఏంటంటే.. పరిస్థితి ఏమంత బాగా లేదు. చాలా రాష్ట్రాల్లో ఆల్టర్నేట్‌గా కూడా లేకుండా పోయింది. పార్టీకోసం పని చేసిన వారికి సరైన గుర్తింపు దక్కకపోవడం, కష్టపడి పని చేస్తే స్వేచ్ఛ ఇవ్వకపోవడం ఇవన్నీ జరుగుతున్నాయన్నది కాంగ్రెస్ పార్టీలోనే ఇంటర్నల్‌గా జరుగుతున్న చర్చ. అంతేకాదు.. దేశంలో ఎఫెక్టివ్ లీడర్స్, గెలుపోటములను డిసైడ్ చేసే లీడర్ షిప్ ను కూడా హస్తం పార్టీ దూరం చేసుకుంది. మధ్యప్రదేశ్‌లో జ్యోతిరాదిత్య వెళ్లిపోయారు. రాజస్థాన్ లో సచిన్ పైలట్ కు పెద్దగా అవకాశాలు దక్కలేదు. సీనియర్లు అంటూ పవర్ ఉన్న వారిని పక్కన పెడుతూ వచ్చారన్న వాదన ఉంది.

జనంలో బలంగా ఉన్న వారిని నమ్ముకోవడం బెటర్

రాహుల్ గాంధీ చెప్పినట్లు రేసు గుర్రాలను రేసుకే పంపాలి. జనంలో ఇన్‌ఫ్లూయెన్స్ ఉన్నోళ్లకే టిక్కెట్ ఇవ్వాలి. పార్టీలో ఎప్పటి నుంచో ఉన్నారని ఇస్తే కుదరదు.. మార్పు కావాలి అన్న నినాదాలు కార్యకర్తల నుంచి వస్తున్నాయి. నిజానికి కొత్త నాయకత్వాన్ని బీజేపీ ఎంకరేజ్ చేస్తూ వస్తోంది. కొత్త ముఖాలతో బరిలో దిగుతోంది. అవసరమనుకుంటే పక్క పార్టీల్లో బలమైన నేతలు ఉంటే వారిని కూడా ఆకర్షించి పగ్గాలు అప్పగిస్తున్నారు. ఇదే కాంగ్రెస్ చేయలేకపోతోంది. కుంటి గుర్రాలనే నమ్ముకుంటోందా అన్న చర్చ అయితే జరుగుతోంది.

తెలంగాణలో రేవంత్‌కు పగ్గాలు ఇచ్చి సక్సెస్

నిజానికి ఒక్క తెలంగాణలోనే కాంగ్రెస్ హైకమాండ్ తీసుకున్న నిర్ణయం సక్సెస్ అయింది. ఎన్నికలకు ముందే రేవంత్ రెడ్డిని పీసీసీ చీఫ్ గా నియమించారు. పగ్గాలు ఇచ్చి స్వేచ్ఛ ఇచ్చారు. మార్పు కావాలి.. కాంగ్రెస్ రావాలి అంటూ చేసిన ప్రచారం సక్సెస్ అయింది. బలమైన నాయకుడి చేతిలో పార్టీ పగ్గాలు పెడితే ఎలాంటి ఫలితం వస్తుందో తెలంగాణలో ప్రూవ్ అయింది. ఇప్పుడు అలాంటి స్ట్రాటజీనే మిగితా రాష్ట్రాల్లో అమలు చేయాలనుకుంటోంది.

బూత్ లెవల్ జిల్లాస్థాయి నేతలకే బాధ్యతలు

కర్ణాటకలో డీకే శివకుమార్ అంతా తానై చేస్తే.. సామాజిక సమీకరణాల నేపథ్యంలో సిద్ధరామయ్యకు సీఎం పగ్గాలు దక్కాయి. కష్టపడి పని చేసేది ఒకరైతే.. అవకాశం మరొకరికి ఇస్తున్న పరిస్థితి.. అందుకే ఈ సమస్యలు. ఎవరు పని చేస్తే వారికే ప్రయారిటీ.. ఇవ్వడం కీలకం అంటున్నారు. సో మార్పు కోసం బూత్ లెవెల్ జిల్లాస్థాయి నేతలనే కాంగ్రెస్ నమ్ముకుంటోంది. గ్రౌండ్ లెవెల్ లోకి వెళ్లి సంస్థాగతంగా బలోపేతం అవ్వాలనుకుంటోంది. అందుకోసం లేటెస్ట్ గా సంఘటన్ సృజన్ అభియాన్ కార్యక్రమాన్ని కాంగ్రెస్ చేపట్టింది.

కాంగ్రెస్‌లో కొత్త సంకల్పం, శక్తిని నింపేలా కార్యక్రమం

ఇది సంస్థాగతంగా పార్టీని బలోపేత కార్యక్రమం. పార్టీలో కొత్త నాయకత్వాన్ని, ఉత్సాహాన్ని పెంచడం, గ్రాస్ రూట్ లెవెల్ లో పార్టీ నిర్మాణాన్ని బలోపేతం చేయడం, కొత్త కార్యకర్తలను చేర్చుకోవడం, వారికి ట్రైనింగ్ ఇవ్వడం, పార్టీ లక్ష్యాల కోసం వారిని రెడీ చేయడం ఇందులో కీలకంగా ఉన్నాయి. కాంగ్రెస్ పార్టీలో కొత్త సంకల్పం, శక్తిని నింపేలా కార్యక్రమం తీసుకున్నారు. సంఘటన్ సృజన్ అభియాన్ అని కార్యక్రమం మొదలైందిగానీ.. విచిత్రమేంటంటే ఇది కాంగ్రెస్ లోనే చాలా మందికి ఇంకా తెలియదు. ప్రచారం ఎక్కువగా చేయలేదు. ఇక అందరిలోకి వెళ్లేదెప్పుడు?

యూత్, మిడిల్ క్లాస్ ఓటర్లను ఆకర్షించడంలో విఫలం

బీజేపీ అజెండాపై స్టాండ్ ఉంది. క్లారిటీ ఉంది. అటు కాంగ్రెస్ లౌకిక, సామాజిక న్యాయంపై ఫోకస్ పెట్టినప్పటికీ, ఇది యువత అలాగే మధ్యతరగతి ఓటర్లను ఆకర్షించడంలో విఫలమవుతోంది. ఇక్కడ కూడా కాంగ్రెస్ స్టెప్ తీసుకోవాలి. డీసీసీలకు ఎక్కువ అధికారాలు ఇచ్చే ప్రణాళిక స్పీడప్ చేయాలి. సోషల్ మీడియాను మరింత బలోపేతం చేసుకోవాల్సి ఉంది. అమలైన హామీలను సోషల్ మీడియా ద్వారా జనంలోకి తీసుకెళ్లాలి.

అంతర్గత విభేదాలను తగ్గించుకోవడం ముఖ్యం

ప్రాంతీయ పార్టీలతో సమన్వయం పెంచుకోవాల్సి ఉంది. యువత, మహిళలను ఆకర్షించేందుకు నిర్దిష్ట విధానాలను ప్రకటించాలి. ఫైనల్ గా అంతర్గత విభేదాలను తగ్గించి, సీనియర్లు, యువనాయకుల మధ్య సమన్వయం పెంచాలి. రేసు గుర్రాలకే టిక్కెట్లు ఇవ్వాలి. బలమైన నేతలను పార్టీలోకి ఆహ్వానించాలి. ఇవన్నీ జరగాలంటే కాంగ్రెస్ ఫస్ట్ పాత విధానాలకు స్వస్తి పలకాలి.

# శ్రామికులను విస్మరిస్తున్న ప్రభుత్వాలు

న్యూఢిల్లీ, సామాజిక న్యాయం అంటే సమాజంలో అట్టడుగున ఉన్న దళితులు, ఆదివాసీలు, బడుగు బలహీనవర్గాలవారు ఇతర కులాలతో పాటు సమానంగా అభివృద్ధి కావడం. అంటరానితనం, కుల వివక్ష అంతం కావాలి. బలహీనులపై దాడులు చేసిన మోతుబరులతో రాజీ కుదిర్చే అధికార యంత్రాంగం తీరు మారి, 'చట్టం తన పని తాను చేసుకునేలా' రూపొందడం విధానాల మార్పు ద్వారానే సాధ్యం. గిరిజనులు కేంద్రీకరించివున్న 30 మండలాల్లో సగం ఆవాసాలకు కనీసం రోడ్డు కూడా లేదని రాష్ట్ర ప్రభుత్వ గణాంకాలు ఘోషిస్తున్నాయి. మహిళపై నేరాలు నానాటికీ పెచ్చరిల్లుతున్నాయి. దళిత, గిరిజన, వెనుకబడిన తరగతులు, మహిళలు, మైనార్టీ తరగతుల సమస్యల పరిష్కారానికి రాయితీలు కల్పించడం మాత్రమే పరిష్కారం కాదు. శ్రామికులకు, ఆరుగాలం కష్టపడ్డ అన్నదాతలకు శ్రమకు తగిన ప్రతిఫలం దక్కడంలేదు. వారి కష్టఫలితం వారికి దక్కితేనే జీవన ప్రమాణాలు మెరుగవుతాయి. అదే విధంగా కార్మికులకు కనీసవేతనం 18 వేలు చెల్లించడంతోపాటు, కార్మిక చట్టాలను పటిష్టపర్చడం అవసరం.అప్పుడో ఇప్పుడో నష్ట పరిహారం లేదా సబ్సిడీ ఇవ్వడం కాకుండా పంట పండించడానికి చేసిన ఖర్చుకు 50 శాతం అదనంగా ధర రైతుకు చెల్లించేలా చట్టం చేయాలి. కౌలురైతులు, ఉద్యోగ, ఉపాధ్యాయ సమస్యలపట్ల ప్రత్యామ్నాయ కార్యక్రమం స్పష్టమైన డిమాండ్లు రూపొందించింది. యువ ఉద్యోగులు, ఉపాధ్యాయుల మెడ మీద కత్తిలా వేలాడుతున్న సిపిఎస్ విధానాన్ని తెచ్చింది వాజ్‌పాయి ప్రభుత్వమే. మన్మోహన్ సింగ్‌తో పాటు రాజశేఖరరెడ్డి, కిరణ్‌కుమార్ రెడ్డి ప్రభుత్వాలు దాన్ని యధాతథంగా అమలు చేశాయి. సిపిఎస్ రద్దు చేస్తామని 2014లో హామీనిచ్చిన చంద్రబాబు ఆ ఊసే ఎత్తలేదు. పెట్టుబడిదారీ విధానాన్ని అమలు చేస్తున్న ప్రస్తుత కేంద్ర, రాష్ట్ర పాలక పార్టీలు ఖజానాను సంపన్నులకు దోచిపెట్టడమేగాక అవినీతిని పెంచి పోషిస్తున్నాయి. ప్రపంచబ్యాంకు ఆదేశిత సంస్కరణలు, జలయజ్ఞం వగైరా అవినీతి అందరికీ తెలిసిందే! అవినీతి రహితంగా ప్రభుత్వ పాలన, పారదర్శకంగా నిర్ణయాలు, పంచాయతీలకు మున్సిపాలిటీలకు నిధులు వంటి అంశాలను ప్రత్యామ్నాయ కార్యక్రమం పేర్కొంది. రాజకీయ అవినీతిని అంతం చేయడం ప్రత్యామ్నాయ శక్తులకే సాధ్యం. ఎన్నికల సంస్కరణలు, ప్రధానంగా దామాషా ఎన్నికల విధానం నేటి అవసరం. మౌలికమైన భూమి సమస్య మొదలు విశ్వ వ్యాపితమైన పర్యావరణ అంశం వరకు అనేక విషయాలపై ప్రత్యామ్నాయ కార్యక్రమం పూర్తిగా సామాన్య పజల కోర్కెలను ప్రతిబింబించేదిగా వుంది. సంపన్నుల కొమ్ముకాసే చర్యలవల్ల కొద్దిమంది కోటీశ్వరులవుతున్నారు. కాబట్టి ఈ విధానాలకు ప్రత్యామ్నాయం రావాలి.

# దివంగత అధ్యక్షుడు జిమ్మీకార్టర్‌పై ప్రేలాపన

వాషింగ్టన్,అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్.. మాజీ అధ్యక్షుడి మరణంపై అనుచితంగా మాట్లాడారు. అమెరికా మాజీ అధ్యక్షుడు జో బైడెన్ పరిపాలన గురించి మాట్లాడుతూ ఇటీ-వల మరణించిన మాజీ అధ్యక్షుడు జిమ్మీ కార్టర్ మరణంపై ట్రంప్ అవహేళనగా మాట్లాడారు. జో బైడెన్ తన కంటే 'చెత్త' అధ్యక్షుడు అని తెలుసుకుని జిమ్మీ కార్టర్ సంతోషంగా కన్నుమూశారని వ్యాఖ్యానించారు. గురువారం ఇటలీ ప్రధాని జార్జియా మెలోనీతో కలిసి ఓవల్ ఆఫీసులో విలేకర్లతో మాట్లాడుతూ ట్రంప్ ఈ అనుచిత వ్యాఖ్యలు చేశారు. జో బైడెన్ పరిపాలన చాలా భయంకరమైందన్నారు. ఎన్నికల్లో ప్రజలను మోసం చేయడంలో సమర్థులని వ్యాఖ్యానించారు. ఆ అసమర్థులు ప్రజలకు ఏమీ చేయలేకపోయారని ధ్వజమెత్తారు. అమెరికా చరిత్రలోనే బైడెన్‌ది చెత్త పరిపాలన అంటూ మండిపడ్డారు. జిమ్మీ కార్టర్ కంటే బైడెన్ అధ్వానంగా పరిపాలించారని.. ఈ విషయం తెలుసుకుని కార్టర్ సంతోషంగా కన్నుమూశారని ట్రంప్ పేర్కొన్నారు. అమెరికా 39వ అధ్యక్షుడు జిమ్మీ కార్టర్ బాధ్యతలు నిర్వర్తించారు. గతేడాది డిసెంబరు 29న ఆయన మరణించారు. జనవరిలో జరిగిన అంత్యక్రియలకు ట్రంప్‌తో సహా పలువురు మాజీ అధ్యక్షుల దంపతులు హాజరయ్యారు.

# రాష్ట్ర ప్రజల ఆశలు!

అమరావతి,నవ్యాంధ్రప్రదేశ్ నూతన రాజధాని అమరావతిలో పునర్నిర్మాణ పనులకు త్వరలోనే అడుగు పడనుంది. మే 2న అమరావతి రానున్న భారత ప్రదాన మంత్రి నరేంద్ర మోదీ రాజధాని పునర్నిర్మాణ పనులను లాంఛనంగా ప్రారంభించనున్నారు. ఈ మేరకు ఇప్పటికే ప్రధాని టూర్ షెడ్యూల్ ఖరారు అయ్యింది. మోడీ పర్యటనకు, పునర్నిర్మాణ ప్రారంభోత్సవానికి ఏర్పాట్లు శరవేగంగా జరుగు తున్నాయి. మే2వ తేదీన సాయంత్రం నాలుగు గంటలకు మోడీ చేతుల మీదుగా అమరావతి పునర్నిర్మాణ పనులు ప్రారంభం కానున్నాయి. ఇప్పటికే పీఎం పర్యటనపై సీఎస్ సమీక్ష నిర్వహించారు. పర్యటన ఏర్పాట్లపై అధికారలతో సమీక్ష నిర్వహించారు.మోడీ అమరావతి పునర్నిర్మాణ పనుల ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని నభూతో అన్నట్లుగా నిర్వహిం చాలని ప్రభుత్వం పట్టుదలతో ఉంది. మోడీ సభకు దాదాపు 5లక్షల మంది ప్రజల పాల్గొంటారన్న అంచనాతో ఏర్పాట్లు చేస్తున్నారు. సచివాలయం వెనక 250 ఎకరాల విస్తీర్ణంలో మోడీ సభ జరగనుంది. అందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. వర్షం పడినా ఎటువంటి ఇబ్బందీ లేకుండా సభా స్థలంలో వాటర్ ప్రూఫ్ టెంట్లు ఏర్పాటు చేస్తున్నారు. ఇదంతా ఓకే కానీ గతంలో అమరావతి నిర్మాణానికి భూమి పూజ చేయడానికి వచ్చిన సందర్భంగా మోడీ పవిత్ర జలాలు, పుణ్య క్షేత్రాల నుంచి మట్టి తీసుకువచ్చారు. ఈ సారి అమరావతి పునర్నిర్మాణ కార్యక్రమానికి రానున్న మోడీ ఏం తీసుకువస్తారన్న ఆసక్తి సర్వత్రా వ్యక్తం అవుతున్నది. ప్రధాని హోదాలో అమరావతి నిర్మాణానికి నరేంద్రమోడీ 2017లో శంకుస్థాపన చేశారు. రాష్ట్ర విభజనతో అన్ని విధాలుగా నష్టపోయిన ఏపీకి మోడీ ఆ సందర్భంగా భారీ వరాలను ప్రకటిస్తారని అంతా భావించారు. అయితే పుణ్య స్థలాల నుంచి మట్టి, పుణ్య నదుల నుంచి జలం తీసుకువచ్చిన మోడీ ఏపీకి కానీ, ప్రపంచ స్థాయి రాజధాని కావాలని ఆయన నోటీతోనే చెప్పిన అమరావతికి కానీ ఎటువంటి ప్యాకేజీ ప్రకటించలేదు. దీనిపై అప్పట్లోనే పెద్ద ఎత్తున విమర్శలు వెల్లువెత్తాయి. దీంతో ఈ సారి మోడీ అమరావతికి ఏం చేస్తారు? ఏం ఇస్తారు? అన్న చర్చ పెద్ద ఎత్తున సాగుతోంది. అప్పట్లో అంటే 2017లో తెలుగుదేశం పార్టీ ఎన్డీయేలో భాగస్వామ్య పార్టీ మాత్రమే. అయితే తెలుగుదేశం మద్దతు లేకంటే కేంద్ర సర్కార్ కు అప్పట్లో ఇబ్బందులు తలెత్తే పరిస్థితి లేదు. అయితే ఇప్పుడు పరిస్థితి అది కాదు. 2024 ఎన్నికల తరువాత కేంద్రంలో మోడీ సర్కార్ కు తెలుగుదేశం మద్దతు అత్యవసరంగా మారింది. తెలుగుదేవం మద్దతు తోనే మోడీ సర్కార్ మనుగడ సాగుతుందన్న పరిస్థితి ఉంది.దీంతో కేంద్ర ప్రభుత్వం ఏపీకీ,అలాగే తెలుగుదేశం పార్టీకీ గతంలో ఎన్నడూ లేనంతగా ప్రాధాన్యత, ప్రాముఖ్యత ఇస్తున్నారు. అందుకు తగ్గట్టుగానే చంద్రబాబు కూడా కేంద్ర కేబినెట్ బెర్తులు వంటి విషయాలలో పట్టుబట్టకుండా, ఏపీకి ఇతోధిక ఆర్థిక తోడ్పాటుపైనే పట్టుబడుతున్నారు.ఆ కారణంగానే అమరావతికి కేంద్రం నుంచి అనూహ్య మద్దతు లభించింది.

## కోరికలే అసలు శత్రువులు !

తిరుమల,కోరికలు ఎప్పుడూ.. మనలను పరుగులు పెట్టిస్తుంటాయి. అదికావాలి...ఇది కావాలన్న జిజ్ఞాసు రగిలిస్తుంటాయి. శరీరమన్నాక మార్పులు సహజం. శరీరం మార్పులకు లోనై పుట్టుక నుంచి చావు వరకు వ్యవసం, వార్ధకం వంటి లక్షణాలను పొందుతుంది. వ్యవసాయంలో ఉంటే ముసలితనం వచ్చేస్తుందని భయపడతాం. ధనవంతులమైతే అనుకోకుండా పేదవాళ్లమైపోతామేమో అని భయపడతాం. ఏ స్థితిలోనూ భయం కలిగించనిది ఒకే ఒక్కటి. అదే వైరాగ్యం. 'నాకు అక్కర్లేదు!' అనుకునే వాడు ఉన్నంత నిర్భయంగా మరెవ్వరూ ఉండరు. 'నాకిది కావాలి!' అనుకుంటే వంద రకాల తాపత్రయాలు పడాల్సిందే. శివుడు మన్మథుని గర్వాన్ని నిర్మూలనం చేశాడు. మనం కూడా శివ భక్తులమై సంసారంలో ఉంటూనే కామవాంఛలను జయించాలి. అది గ్రహిస్తే యాభై ఏళ్ళ దాటే సరికి కాస్త నెమ్మదిగా వైరాగ్య మార్గంలో వడతాం. అప్పుడు నిర్భయంగా ఉండగలుగుతాం. జీవితంలో ఏదైనా భయం కలిగించేదే. పాండిత్యం సంపాదిస్తే, అంతకన్నా ఎక్కువ పాండిత్యం ఉన్న వాడు వస్తాడని భయపడతాం. అందంగా ఉంటే ఈ అందం దెబ్బతింటుందేమోనని భయపడతాం. ఆ గర్వాన్ని జయించాలంటే పార్వతీపరమేశ్వరులిద్దరినీ మనం ఆశ్రయించాలి. నారదుడు మొదలుకుని ముఖ్యమైన మునులందరూ నిరంతరం భగవంతుని ధ్యానంలో గడిపారు. వారి మనః పద్మాలలో శివుడు తుమ్మెదలా విహరిస్తున్నాడు. మనమూ అలా నిరంతరం భగవంతుని ధ్యానంలో గడుపుదాం. మనస్సులో భక్తి తప్ప మరేమీ ఉండకూడదు. 'అంతా నువ్వే!' అని భగవంతుణ్ణి వేడుకోవాలి. దేశం బాగుపడటానికి, జీవితం బాగుపడటానికి ఆధ్యాత్మికతను మించిన మార్గం లేదు. శంకరాచార్యుల నుంచి వివేకానందుల వరకు ఇదే ఆచరించి చూపారు. కావాలను కుంటేనే సమస్యలు వచ్చి పడతాయి. అందువల్ల తాహతుకు మించి కోరికలను కోరుకుంటే సమస్యలు చుట్టుముడతాయి.

## ఆత్మరక్షణలో కూటమి!

తిరుపతి:తిరుపతిలోని టీటీడీ గోశాలలో ఆవులు చనిపోతున్నాయంటూ టీటీడీ మాజీ ఛైర్మన్, వైసీపీ సీనియర్ నేత భూమన కరుణాకర రెడ్డి లేవనెత్తిన అంశం దేశ వ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది. ఈ వివాదంలో ఎలా స్పందించాలో, ఎలా వ్యవహరించాలో తెలియక, మరోవైపు ఆగ్రహాన్ని మూటకట్టుకుంటూ కూటమి ప్రభుత్వం పూర్తిగా ఆత్మరక్షణలో పడింది.గోశాలలో గోవులు మరణిస్తున్నాయని భూమన చేసిన విమర్శలను టీటీడీ మొదట్లో చాలా తేలిగ్గా తీసుకుంది. అలాంటిదేమీ లేదంటూ కొట్టిపారేసింది. ఆ తర్వాత కరుణాకర రెడ్డి గోవులు మృతి చెందిన ఫొటోలు విడుదల చేయడంతో వివాదం మరింత రాజుకుంది. దాంతో టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడు స్పందిస్తూ వృద్ధాప్యంతో కొన్ని ఆవులు మృతి చెందినమాట వాస్తవమేనని అంగీకరించారు. ఆ మరుసటిరోజే మీడియా సమావేశం నిర్వహించిన టీటీడీ ఈవో శ్యామలారావు గోశాలలో మూడు నెలల కాలంలో 43 ఆవులు మరణించినట్టు అధికారికంగా ప్రకటించారు. ప్రతినెలా సగటున 15 ఆవుల దాకా మరణిస్తూ వుంటాయని కూడా ఈవో వెల్లడించారు. మరోవైపు తిరుపతి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు 42 గోవులు మాత్రమే మృతి చెందాయని సెలవిచ్చారు. దీంతో భూమన చేసిన విమర్శలను ఈవోతో పాటు ఛైర్మన్, కూటమి ఎమ్మెల్యే ధ్రువీకరించినట్లు అయింది.టీటీడీ ఈవో ప్రెస్మీట్ తర్వాత భూమన విమర్శలకు మరింత బలం చేకూరింది. గోశాలలో 1800 ఆవులుంటే అందులో వృద్ధాప్యం కారణంగా నెలకు 15 ఆవులు మరణించడం ఏమిటన్న చర్చ మొదలయింది. ఈ లెక్కన 10 ఏళ్లలో గోశాలలోని ఆవులన్నీ అంతరించిపోతాయి. వాస్తవంగా పశువుల సహజ మరణాల రేటు 3 శాతం మాత్రమే వుంటుందని శాస్త్రవేత్తల అధ్యయనాలు చెబుతున్నాయి. అంటే. వెయ్యి పశువులుంటే అందులో వృద్ధాప్యం వల్ల ఏడాదికి 30 మాత్రమే చనిపోతాయి. ఆ లెక్కన గోశాలలో మరణించే పశువుల సంఖ్య ఏడాదికి 60కి మించకూడదు. అయితే మూడు నెలల్లోనే 43 ఆవులు మరణించినట్లు ఈవో ప్రకటించడం సంచలనంగా మారింది. ఈ పరిస్థితుల్లో భూమన చేసిన విమర్శలు నిజమేకదా అనే భావన సర్వత్రా వ్యక్తయింది. భూమన చెప్పిన 100 సంఖ్యలో తేడా వుండొచ్చేమోగానీ ఆవుల మరణాలు నిజమేకదా, టీటీడీ ఏమి చేస్తోందని అంటూ శ్రీవారి భక్తులు ప్రశ్నించడం మొదలుపెట్టారు. ఈ క్రమంలోనే తెలుగుదేశం అనుకూల మీడియా కొత్త, వింత ప్రచారానికి శ్రీకారం చుట్టింది. వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ మతాల మధ్య చిచ్చుపెట్టడానికి ప్రయత్నిస్తున్నదంటూ ఒకమాట, హిందువుల మనోభావాలను దెబ్బతీస్తున్నదం టూ ఇంకోమాటను ప్రచారంలోకి తెచ్చింది. టీటీడీ గోశాలలో జరుగుతున్న అన్యాయాన్ని బయటకుతెస్తే.. సరి చేసుకోకుండా ఇదేమి ఎదురుదాడి అనే అభిప్రాయం సోషల్ మీడియాలో వ్యక్తమయింది. గోవులు మృతి చెందాయని టీటీడీ అంగీకరిస్తుండగా, దాన్ని బయటకు వెల్లడించడం హిందూ ధర్మాన్ని కించపరచడం ఎలా అవుతుందన్న ప్రశ్న కూటమి ప్రభుత్వానికి ఎదురయింది. మొత్తంగా ప్రభుత్వ అనుకూల మీడియా ఎత్తుకున్న ప్రచార ఎత్తుగడ ఫలించలేదు. ఈ క్రమంలోనే చంద్రబాబు నాయుడు మొన్న జరిగిన కేబినెట్ సమావేశంలో గోశాల వివాదాన్ని ప్రస్తావించారు. భూమన చేస్తున్న విరమర్శలను సరిగా తెప్పికొట్టలేకపోతున్నామని ఆయన మంత్రులపై అసహనం వ్యక్తం చేసినట్లు వార్తలొచ్చాయి. అధినేత అలా మాట్లాడాక కూడా ఊరుకుంటే ఇబ్బంది అవుతుం దని అనుకున్నారో ఏమోగానీ. తిరుపతిలోని కూటమి నేతలు తీరిగ్గా వారం రోజుల తరువాత హడావుడి మొదలుపెట్టారు. గోశాలపై భూమన చేస్తున్న విమర్శలకు నిరసనగా గురువారం ఉదయాన గోశాల వద్దకు ర్యాలీ చేస్తామంటే బుధవారం రాత్రి నుంచి ఇటు తిరుపతి, అటు చంద్రగిరి నియోజకవర్గం నేతలు వాట్సాప్ గ్రూపుల్లో మెసేజ్‌లు పెట్టడం మొదలుపెట్టారు. అలాగే టీటీడీ రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాస్ కూడా భూమనకు సవాల్ విసిరారు. ఈ అంశంపై చర్చకు రావాలని డిమాండ్ చేశారు. ఈ సవాల్‌ను స్వీకరిస్తున్నానని, గురువారం ఉదయం 10 గంటలకు గోశాల వద్దకు చర్చకు వస్తానని కరుణాకర రెడ్డి ప్రకటించారు. దీంతో గురువారం తెల్లవారేకల్లా పరిస్థితి మారిపోయింది. తాము ర్యాలీ చేయడం లేదని, ఎమ్మెల్యేలు గోశాలను సందర్శించి, మీడియాతో మాట్లాడతారని కూటమి నేతలు వాట్సాప్ గ్రూపుల్లో మెసేజ్‌లు పెట్టారు. మరోవైపు బుధవారం రాత్రి నుంచే తిరుపతిలోని వైసీపీ నేతల ఇళ్ల వద్దకు పోలీసులు చేరుకున్నారు. నేతలను గృహ నిర్బంధం చేశారు. భూమన కరుణాకర రెడ్డి ఇంటి వద్ద దాదాపు 100 మంది పోలీసులు మోహరించారు. ఆయన్ను బయటకు రానీకుండా ఇంటిలోనే నిర్బంధించారు. వాస్తవంగా టీటీడీ ఈవో వివరణ ఇచ్చిన తర్వాత ఈ అంశంపైన ఇక మాట్లాడకూడదని, వదలిపెట్టాలని భూమన భావించారు. అయితే పార్టీ అధినేత మెప్పు కోసం కూటమి నేతలు హడావుడిగా ర్యాలీ ప్రకటన చేశారు. అధికారంలో వున్న పార్టీ ర్యాలీ చేయడం ఏమిటి?

## సంచలన ప్రకటన

వాషింగ్టన్:అమెరికా అధ్యక్షుడిగా ట్రంప్ రెండో సారి అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఉక్రెయిన్-రష్యా యుద్ధాన్ని ఆపేందుకు తీవ్ర ప్రయత్నం చేస్తున్నారు. ఇందులో భాగంగా సౌదీ అరేబియా వేదికగా పలుమార్లు రష్యా-అమెరికా అధికారుల మధ్య చర్చలు జరిగాయి. అంతేకాకుండా స్వయంగా రష్యా అధ్యక్షుడు పుతిన్‌తో కూడా ట్రంప్ ఫోన్‌లో సంభాషించారు. అయినా కూడా ఇప్పటి వరకు ఎలాంటి పురోగతి లభించలేదు. ఓ వైపు చర్చలు జరుగుతుండగానే వైమానిక దాడులు జరుగుతునే ఉన్నాయి. తాజాగా పామ్ సండే రోజున కూడా రష్యా భీకరదాడులు చేసింది. తాజాగా ఇదే అంశంపై అమెరికా విదేశాంగ కార్యదర్శి మార్కో రూబియో స్పందిస్తూ సంచలన వ్యాఖ్యలు చేశారు.

# పారదర్శకతే ప్రాణం!



న్యూఢిల్లీ,మన ఎన్నికల సంఘం(ఈసీ)కి ఇష్టమున్నా లేకున్నా ఈవీఎంలపై సంశయాలు తరచు తలెత్తుతూనే ఉన్నాయి. ఇక్కడే కాదు... వేరే దేశాల్లో సైతం సందేహాలు వినబడుతూనే వున్నాయి. ఆ మధ్య టెస్లా సీఈఓ ఎలాన్ మస్క్ ఈవీఎంలను హ్యాక్ చేయటం సులభమని, దీన్ని తాను నిరూపించగలనని సవాలు విసిరారు. ఇప్పుడు ఆ వరసలో అమెరికా జాతీయ నిఘా విభాగం డైరెక్టర్ తులసి గబ్బార్డ్ సైతం నిలిచారు. అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ సమక్షంలో కేబినెట్ భేటీలో ఆమె ఈవీఎంల భద్రతా లోపాలపై పలు ఆధారాలు సమర్పించారు. యథావిధిగా దీనిపైనా మన ఈసీ స్పందించింది. ఆమె వ్యాఖ్యలు మన ఈవీఎంలకు వర్తించబోవని మాట్లాడింది. సమస్యంతా అక్కడేవుంది. మన దేశంలో పార్టీలు చేసే ఆరోపణలకు ఆ సంఘం నోరు మెదపదు. ఒక జాతీయ పార్టీ, లోక్‌సభలో ప్రధాన ప్రతిపక్షం అయిన కాంగ్రెస్ మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల విషయంలో చేసిన ఆరోపణలకు వెనువెంటనే జవాబివ్వడానికి ఈసీకి తీరిక లేకపోయింది. పార్లమెంటులో ఈవీఎంలపై తీవ్ర దుమారం రేగాక మాత్రమే స్పందించింది. గత ఏడాది నవంబర్ 4న మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలు జరగ్గా ఆ నెల 23న ఫలితాలు ప్రకటించారు. ఆ తర్వాతనుంచి కాంగ్రెస్, ఎన్సీపీ ఈవీఎంలపై సందేహాలు వ్యక్తం చేస్తూనే వచ్చాయి. 95 నియోజక వర్గాల్లో ఈవీఎంలూ, వీవీప్యాట్ స్లిప్‌లూ తనిఖీ చేసి అవి సరిపోలాయో లేదో చెప్పాలని 104 అభ్యర్థనలు వచ్చాయి. వాటిని అంగీకరిస్తే దాదాపు 755 ఈవీఎంల తనిఖీ తప్పనిసరవుతుంది. ఇందులో ఎన్సీపీనుంచి దాఖలైనవే ఎక్కువ. ఇవిగాక న్యాయస్థానాల్లో దాఖలైన ఎన్నికల పిటిషన్లు సరేసరి. హరియాణాలో సైతం ఈవీఎంలపై ఆరుచోట్ల అభ్యర్థనలొచ్చాయి. జమ్మూ కశ్మీర్‌లో ఒక స్థానం నుంచి ఈ మాదిరి వినతి వచ్చింది. ఆరోపణలొచ్చినప్పుడల్లా ఈసీ ఇచ్చే జవాబు ఒకే విధంగా ఉంటున్నది. మన ఈవీఎంలు సురక్షితమైనవి, జొరబడటానికి అసాధ్యమైనవి అన్నదే దాని వాదన. అలాగే అవి ఇంటర్నెట్‌తోసహా దేనికీ అనుసంధానించి వుండవు కనుక వైఫై, బ్లూటూత్‌ల ద్వారా ఏమార్చటం ఏమాత్రం కుదరదని కూడా చెబుతోంది. అమెరికాలోని బోస్టన్‌లో జరిగిన సాంకేతిక సదస్సులో కంప్యూటర్ శాస్త్రవేత్త అలెక్స్ హాల్డర్‌మాన్ ఆనవాలు మిగల్చకుండా ఈవీఎంను హ్యాక్ చేయటం, ఫలితాన్ని తారుమారు చేయటం ఎంత సులభమో నిరూపించారు. వీవీ ప్యాట్ యంత్రాలతో అనుసంధానించివున్నా ఈవీఎంల పనితీరు ఎన్ని సంశయాలకు తావిస్తున్నదో వివరించే గణాంకాలు సదస్సులో సమర్పించారు. కార్నెగీ మెలాన్ యూనివర్సిటీ ప్రొఫెసర్ డేవిడ్ ఎకార్ట్ ఈవీఎంలో వోటేసిన వెంటనే స్క్రీన్‌పై ఎంపిక చేసుకున్న అభ్యర్థి పేరే కనబడుతున్నా వేరేవారికి వోటు పడటంవంటి ఉదంతాలను వివరించారు. ఇంటర్నెట్‌తో ఈవీఎంలను అనుసంధానించకపోయినా హ్యాక్ చేయటం సాధ్యమేనన్నారు. ఈవీఎంలలో గుట్టుచప్పుడు కాకుండా రిమోట్ యాక్సిస్ సాఫ్ట్‌వేర్‌ను నిక్షిప్తం చేయటంద్వారా ఇది చేయొచ్చన్నది ఆయన వాదన. అసలు ఈవీఎంల రవాణా, పంపిణీ విధానం లోపభూయిష్టంగా ఉన్నదని సమాచార హక్కు చట్టంకింద అడిగిన ప్రశ్నలకు వచ్చిన సమాధానాలు వెల్లడించాయి. తన నిర్వహణలో సమర్థవంతంగా ఎన్నికలు జరుగుతున్నాయని, అందులో సందేహాలకు తావు లేదని ఎన్నికల సంఘం నమ్మటం తప్పేమీకాదు. ఆమాత్రం ఆత్మవిశ్వాసం ఉండటాన్ని ఎత్తిచూపించాల్సిన అవసరం లేదు. కానీ అదే విశ్వాసం అందరిలో కలగటానికి అది చేస్తున్నదేమిటన్నదే ప్రశ్న. పోలింగ్ ప్రక్రియ ముగిసిన వెంటనే, ఆ రోజు రాత్రి, ఆ తర్వాత విడుదల చేసే పోలింగ్ శాతం వివరాలు ఆశ్చర్యం కలిగిస్తున్నా, వాటిల్లో ఎందువల్ల వ్యత్యాసం చోటుచేసుకుంటున్నదో సందేహాతీతంగా అది వివరించలేకపోతున్నది. నిరుడు జరిగిన ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికలు కావొచ్చు... మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల సమయంలో కావొచ్చు పోలింగ్ శాతం పెరుగుదలలో తీవ్ర వ్యత్యాసం కనబడటం అందరినీ ఆశ్చర్యపరిచింది. ఏపీలో పోలింగ్ జరిగిన రాత్రి 8 గంటలకు 68.12 శాతం పోలింగ్ నమోదైందని చెప్పిన ఈసీ మరో నాలుగు రోజులకల్లా దాన్ని 80.66 శాతంగా ప్రకటించింది. నాలుగురోజుల వ్యవధిలో ఈ పెరుగుదల ఏకంగా 12.5 శాతం! సంఖ్యా పరంగా 49 లక్షల వోట్లు పెరిగినట్టు లెక్క! మొదటగా అనుకున్న శాతానికీ, చివరిగా ప్రకటించిన శాతానికీ మధ్య తేడాకు కారణాలేమిటో వివరించే ప్రయత్నం ఈనాటికీ ఈసీ చేయలేదు. మహా రాష్ట్రలోనూ అసెంబ్లీ ఎన్నికల్లో పోలింగ్ ముగిశాక 58.2 శాతం పోలింగ్ అని చెప్పి, ఆ తర్వాత దాన్ని 65.02కు పెంచి తీరా కౌంటింగ్ ముందు అది 66.05 శాతం అన్నారు. బ్యాలెట్ విధానంలో ఇలాంటి వ్యత్యాసాలు కనబడ్డాయంటే అర్థం చేసుకోవచ్చు. లెక్కించేది మనుషులే గనుక పొర బడ్డారని సరిపెట్టుకోవచ్చు. కానీ ఈవీఎంల విధానంలో అలా కాదు. ఎప్పటి కప్పుడు పోలైన వోట్ల సంఖ్య తెలిసిపోతుంది. మరి ఈ తేడాల వెనకున్న మతలబేమిటో ఎందుకు చెప్పరు? ఈవీఎంల చార్జింగ్ అమాంతం పెరిగిపోవటంపైనా అనేక సందేహాలున్నాయి. ప్రశ్నించినప్పుడు మౌనం వహించటమే పెద్దరికమవుతుందని ఈసీ భావిస్తున్నట్టుంది. ప్రజాస్వామ్యానికి కీలకమని భావించే ఎన్నికల ప్రక్రియలో పారదర్శకత కరువైతే అది చివరకు ప్రజాస్వామ్యాన్నే అపహాస్యం పాలు చేస్తుంది. అది ఇప్పటికే ఎంతో కొంత మొదలైంది. అందుకనే బ్యాలెట్ విధానాన్ని తిరిగి ప్రవేశపెట్టాలన్న డిమాండ్ క్రమేపీ పుంజుకుంటున్నది. ఈవీఎంలు నమ్మదగ్గవి కాదని ప్రపంచంలో ఏమూల ఎవరు చెప్పినా ఇక్కడ భుజాలు తడుముకోవటంవల్ల ప్రయోజనం లేదు. అలాగే పారదర్శకతకు ప్రత్యామ్నాయం కూడా ఉండదు.

# ఉస్మానియాలో చదివే వాతావరణం లేదా! ఈ పరిస్థితికి కారణం ఏంటి?

హైదరాబాద్,తెలంగాణ రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలలో నివసించే విద్యార్థుల చిరకాల స్వప్నం ఉస్మానియా విశ్వవిద్యాలయంలో చదువుకోవడం. ఈ విశ్వవిద్యాలయం చాలామంది గ్రామీణ విద్యార్థులకు జీవితాన్ని, మంచి భవిష్యత్తును ఇచ్చింది. తెలంగాణ రాష్ట్రంలోని ఏ శాఖలో చూసినా ఏదో ఒక స్థాయిలో ఉస్మానియా వర్సిటీకి చెందిన విద్యార్థి తప్పనిసరిగా ఉంటారు. కానీ ఈ మధ్యకాలంలో నిర్వహించిన ప్రభుత్వ ఉద్యోగాలలో గ్రూప్ 1, గ్రూప్ 2, గ్రూప్ 3, గ్రూప్ 4, ఇతర ఉద్యోగాలలో యూనివర్సిటీ విద్యార్థులకు వచ్చిన ఉద్యోగాలు గతంతో పోలిస్తే చాలా చాలా తక్కువ. అసలు దీనికి కారణం ఏమిటి, దీనికి కారకులు ఎవరు అని ఆత్మవిమర్శ చేసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. తెలంగాణ ఉద్యమానికంటే ముందు, ఉస్మానియా విశ్వ విద్యాలయంలో సీటు వచ్చిన విద్యార్థికి దాదాపు ఏదో ఒక ప్రభుత్వ ఉద్యోగం వచ్చేదని నమ్మకం ఉండేది. విద్యార్థులు కూడా అలాగే కష్టపడి చదివేవారు. అప్పట్లో ఏ ఒక్క నలుగురు ఒక్క దగ్గర నిలబడి చర్చిస్తున్నా, అది ఏ మెటీరియల్ చదివితే బాగుంటుంది, తాము చదువుతున్న వాటిల్లో తప్పులను గురించి, పరీక్షల సరళి గురించి మాట్లాడుకునేవారు.

చదివే వాతావరణం పోయిందా?

2009 కంటే ముందు, తెలంగాణలో వచ్చిన ఏ ఉద్యోగ నోటిఫికేషన్లలో అయినా సరే, దాదాపు 60 శాతం మంది కేవలం ఉస్మానియా వర్సిటీకి చెందిన విద్యార్థులకు మాత్రమే ఉద్యోగాలు వచ్చేవి. ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. అప్పట్లో ఉద్యోగాల నోటిఫికేషన్ వచ్చిందంటే, ఉస్మానియా విశ్వవిద్యాలయం చుట్టుపక్కల ఉన్న బస్తీలన్నీ గ్రామీణ ప్రాంత విద్యార్థులతో కిటకిటలాడేవి. అయితే, ఈ మధ్యకాలంలో నిర్వహించిన ప్రభుత్వ ఉద్యోగాలలో ఉస్మానియా యూనివర్సిటీకి వచ్చిన ఉద్యోగాలు గతంతో పోలిస్తే చాలా చాలా తక్కువ. గతంలో ఓయూలో నాన్ బోర్డర్లుగా ఉన్నా కూడా చాలా కష్టపడే విద్యార్థులు.. ఈ మధ్యకాలంలో ఉస్మానియా విశ్వ విద్యాలయంలో హాస్టల్ వసతి ఉన్నా, చదువుకోవడం వీలు కావడం లేదని అశోక్ నగర్, ఆర్టీసీ క్రాస్ రోడ్డు, దిల్‌షుక్ నగర్ లాంటి ఏరియాలలో హాస్టల్లో ఉండి, స్టడీ హాల్లో చదువుకునే పరిస్థితి ఎందుకు వచ్చింది అనేది చర్చనీయాంశం.

రాజకీయానికి ఆకర్షితులవుతూ..

ఒకప్పుడు ఉద్యోగస్తులను తయారు చేసే కర్మాగారంలో ఉన్న విశ్వవిద్యాలయం ఈ మధ్యకాలంలో విడుదలైన గ్రూప్ -1 ఉద్యోగ ఫలితాలలో కనీసం వేళ్ళ మీద లెక్క పెట్టే అంత మందికి కూడా ఉద్యోగం రాకపోవడం ఆశ్చర్యానికి కలిగించే అంశం. 2009 మలిదశ ఉద్యమంలో చురుకుగా పాల్గొని, తెలంగాణ ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన విద్యార్థుల త్యాగం అనిర్వచనీయమైంది. కానీ తెలంగాణ రాష్ట్రం సిద్ధించిన తర్వాత, ఉస్మానియా విశ్వవిద్యాలయంలో పరిస్థితులు చాలావరకు మారిపోయాయి. ఇంతకుముందు అకడమిక్స్, ప్రభుత్వ ఉద్యోగాలకు ఏ విధంగా తయారవ్వాలి అని, మాట్లాడుకునే విద్యార్థులు.. తరువాత దేశ రాష్ట్ర రాజకీయాల గురించి, తాము రాజకీయంగా ఏ విధంగా



ఎదగాలని, ఏ రాజకీయ నాయకులతో పరిచయాలు పెంచుకుంటే తమకు భవిష్యత్తులో అవకాశాలు వస్తాయని అంచనా వేసుకుని పనిచేయడం ప్రారంభించారు. ఇందులో కొంతమంది విజయం సాధించి మంచి అవకాశాలు రావడంతో ఓయూ విద్యార్థులు ఒకరిని చూసి ఒకరు రాజకీయాలకు ఎక్కువగా ఆకర్షితులవుతున్నారు. ఇందులో భాగంగా, ఉస్మానియా విశ్వవిద్యాలయంలో ఒక్కొక్క కులానికి నాలుగైదు సంఘాలుగా ఏర్పాటు చేసుకోవడం, ప్రతి సంఘానికి అధ్యక్షులు, ఉపాధ్యక్షులు, కార్యదర్శులు లాంటి పదవులు తయారు చేసుకొని విద్యార్థి నాయ కులుగా చలామణి కావడం ప్రారంభించారు.

చులకనవుతున్న ఓయూ స్టూడెంట్స్

దీనివల్ల ఒక్కసారిగా యూనివర్సిటీలో వాతావరణం పూర్తిగా మారిపోయింది. ఒకప్పుడు ఉస్మానియా యూనివర్సిటీ విద్యార్థులు అంటే, ఎంతో గౌరవం ఇచ్చే చాలామంది ఈ మధ్యకాలంలో విద్యార్థుల గురించి చాలా చులకనగా మాట్లాడం మనం చాలా సందర్భాల్లో చూశాం. ఇటువంటి పరిస్థితి ఏర్పడడం వల్ల నిజంగా సేవ చేయాలనుకునే చాలామంది విద్యార్థి నాయకులను, చదువుకునే విద్యార్థులందరినీ అదే కోవలో జతకట్టడం చింతించవలసిన విషయం. ఈ రోజున నిరసన తెలిపే హక్కు పైన కూడా ప్రభుత్వం నిషేధం విధించే పరిస్థితికి తీసుకు రావడానికి కారకులెవరు అనేది, విద్యార్థులు, మేధావులు ఆత్మ విమర్శ చేసుకోవాలి. ఎంతోమందికి మంచి భవిష్యత్తును అందించి, భావి భారత పౌరులుగా తీర్చిదిద్దినటువంటి యూనివర్సిటీ ఈ రోజున శోకసంద్రంలో ఉంది. మొత్తంగా ఓయూలో విద్యా వాతావరణం కుంటుపడిందని చెప్పవచ్చు. ఇందుకు నిదర్శనం ఈ మధ్యకాలంలో వచ్చిన ప్రభుత్వ ఉద్యోగాల ఫలితాలే.

ఓయూలో పూర్వ వాతావరణం రావాలి!

కాబట్టి ఉస్మానియా విశ్వవిద్యాలయానికి పూర్వ వైభవం రావాలంటే, తమ సొంత ఎజెండాతో యూనివర్సిటీకి గాని, సమాజానికి గాని సంబంధం లేని విషయాల గురించి అక్కడ చర్చించకుండా ఉంటే బాగుంటుంది. అలాగే యూనివర్సిటీలో చదువు పూర్తి అయిపోయిన విద్యార్థులను, యూనివర్సిటీ పేరు చెప్పుకొని బయట చలామణి అయ్యే వారిపైన నిషేధం విధించాలి. దీంతో వర్సిటీలో విద్యా వాతావరణం నెలకొనడంతో పాటు యూనివర్సిటీకి పూర్వ వైభవం వస్తుంది.

# ఎసిబికి చిక్కిన నస్పూర్ ఎస్‌ఐ...

మంచిర్యాల, మంచిర్యాల జిల్లాలోని నస్పూర్ పోలీస్‌స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న ఎస్‌ఐ నెల్కి సుగుణాకర్ శుక్రవారం ఎసిబికి దొరికిపోయారు. ఎస్‌ఐపై ఆర్‌టివో కేసు నమోదు చేసినట్లు ఎసిబి, ఎసిపి విజయ్‌కుమార్ తెలిపారు. ఎసిపి విజయ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.... జనవరి 25వ తేదిన జరిగిన ఒక కేసు విషయంలో ప్రభంజన్ అనే వ్యక్తి నుండి 2 లక్షలు రుపాయలను ఎస్‌ఐ సుగుణాకర్ తీసుకొని సీజ్ చేయడం జరిగిందని ఆయన తెలిపారు. నేరంలో పాల్గొన్న వారిని అరెస్టు చేసి 2 లక్షల రుపాయలు స్వాధీనం చేసుకొని వారిని జ్యుడిషియల్ కస్టడికి తరలించడం జరిగిందన్నారు. ఈ విషయంలో ప్రభంజన్ కోర్టును ఆశ్రయించి తన డబ్బు విడుదల ఆర్డర్‌ను పొందడం జరిగిందన్నారు. నిందితుడు ఎస్‌ఐ సుగుణాకర్ ఈనెల 5వ తేదిన ప్రభంజన్‌ను పిలిచి అతని చేతిలో లక్షా 50 వేలు ఇచ్చి ఫొటోలు తీసుకొని మళ్లీ డబ్బులు గుంజుకోవడంతోపాటు డబ్బులు ముట్టినట్లు రైటర్ వద్ద సంతకం పెట్టాలని అనడంతో ఫిర్యాది ప్రభంజన్ పెట్టకపోవడంతో తరువాత రావాలని పంపించడాన్ని తెలిపారు. తిరిగి ఈనెల 8న ప్రభంజన్ పోలీస్‌స్టేషన్ వెళ్లగా డబ్బులు ఖర్చు అయ్యాయని 50 వేలు రూపాయలు మాత్రమే ఇస్తానని చెప్పడంతో ప్రభంజన్ ఎసిబి శాఖను ఆశ్రయించాడు.

## బంగ్లా మైనార్టీ హిందువులనురక్షించండి

న్యూఢిల్లీ,పశ్చిమ బెంగాల్‌లో వక్ఫ్ సవరణ చట్టంతో నెలకొన్న హింసపై బంగ్లాదేశ్ ముఖ్య సలహాదారు ముహమ్మద్ యూనస్ స్పందించిన తీరుపై భారత్ ఘాటుగా సమాధానం చెప్పింది. గత వారం బెంగాల్ రాష్ట్రంలోని ముర్షిదాబాద్ జిల్లాలో చెలరేగిన హింసలో ముగ్గురు మరణించగా, వందలాది మంది గాయపడిన మైనారిటీ ముస్లిం వర్గాలను రక్షించాలని భారత ప్రభుత్వాన్ని యూనస్ కోరారు. ఇక, బంగ్లాదేశ్ వ్యాఖ్యలను విదేశాంగ మంత్రిత్వ శాఖ ప్రతినిధి రణధీర్ జైస్వాల్ తోసిపుచ్చారు. ఇలాంటి అనవసరమైన వ్యాఖ్యలు చేయడం కంటే, తమ దేశంలోని మైనారిటీల హక్కులను కాపాడు కోవడంపై దృష్టి పెట్టాలని చురకలు అంటించాడు. బంగ్లాదేశ్ మైనార్టీలపై కపట ప్రేమ చూపిస్తుందని ఆరోపించారు. బంగ్లాలో మైనారిటీలపై జరుగుతున్న హింస నుంచి దృష్టిని మళ్లించే ప్రయత్నంగా అభివర్ణించారు. ఇక, గత సంవత్సరం మాజీ ప్రధాన మంత్రి షేక్ హసీనా పదవీచ్యుతులైనప్పటి నుంచి బంగ్లాదేశ్‌లో పరిస్థితి గందరగోళంగా ఉంది. బంగ్లాలో మైనార్టులుగా ఉన్న హిందువులపై తీవ్రవాద ఇస్లామిస్టులు అనేకసార్లు దాడులకు పాల్పడ్డారు. దాదాపు 200 దేవాలయాలను ధ్వంసం చేయగా.. పూజారులను అరెస్టు చేశారు.. మైనారిటీలను లక్ష్యంగా చేసుకుని హింసించారనే ఆరోపణలను బంగ్లాదేశ్ తరచుగా ఖండించింది.

## మత విద్వేషాలు రెచ్చగొడుతున్న జగన్: నిమ్మల

పాలకొల్లు,మరోసారి అధికారం కోసం జగన్ విద్వేషాలు రెచ్చగొడుతున్నారని మంత్రి నిమ్మల రామానాయుడు విమర్శించారు. పాస్టర్ ప్రవీణ్ రోడ్డు ప్రమాద ఘటనపై దుష్ప్రచారం చేసి.. మతాల మధ్య చిచ్చుపెట్టాలని చూశారని అన్నారు. వక్ఫ్ బిల్లుపై వైకాపా ద్వంద్వ వైఖరి దేశవ్యాప్తంగా అందరికీ తెలిసిందని చెప్పారు. పశ్చిమగోదావరి జిల్లా పాలకొల్లు నియోజకవర్గంలో శుక్రవారం మంత్రి నిమ్మల పర్యటించారు. పోడూరులో రూ.2.62 కోట్లతో పంటకాల్వల వద్ద రోడ్డుకు శంకుస్థాపన చేశారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ పార్లమెంట్ చరిత్రలో ఓటింగ్ అయ్యాక విప్ జారీ చేసిన ఘనత జగన్‌దే. నాస్తికుడిని తితిదే ఛైర్మన్‌గా నియమించడం జగన్ చేసిన తప్పు. ఆయనకు చెందిన రూ.800 కోట్ల విలువైన షేర్లను ఈడీ సీజ్ చేసింది. దేశంలోని విచారణ సంస్థలన్నీ ఆయన్ని వేలెత్తి చూపుతున్నాయని పేర్కొన్నారు.

## ట్రైన్‌లో అత్యాచారం ఘటన అంతా..ఉత్తిదే

హైదరాబాద్, రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టించిన ట్రైన్‌లో అత్యాచారయత్నం ఘటన కేసు ఇప్పుడు సంచలన మలుపు తిరిగింది. యువతి పై జరిగినదన్న అత్యాచారం అబద్ధంగా తేలింది. ఈ కేసులో రైల్వే పోలీసులు చేపట్టిన లోతైన దర్యాప్తులో అసలు విషయం వెలుగులోకి వచ్చింది. ఇన్‌స్టాగ్రామ్ రీల్స్ చేస్తూ ట్రైన్ లోనుండి జారిపడిన యువతి, అనంతరం తనపై అత్యాచారం జరిగిందని కథ అల్లింది. ఆమె కథనాల ఆధారంగా పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. విచారణలో అనుమానితులుగా 100 మందిని పోలీసులు విచారించగా, అసలు విషయానికి దగ్గరయ్యారు. కేసు తీవ్రతను దృష్టిలో ఉంచుకొని పోలీసులు 250 సీసీటీవీ కెమెరాల ఫుటేజీ ని పరిశీలించారు. అనేక కోణాల్లో వీడియోలను అధ్యయనం చేసిన అనంతరం, యువతి కథనాల్లో అనేక అనుమానాస్పద అంశాలు బయటపడ్డాయి. ఎటు-వంటి ఆధారాలు ఆమె చెప్పిన కథనాలను సమర్థించలేదని పోలీసులు తేల్చారు. విచారణలో చివరికి యువతి అసలు విషయం వెల్లడించింది. రీల్స్ చేస్తూ ట్రైన్ నుంచి జారిపడిన విషయాన్ని దాచిపెట్టి, అత్యాచారం జరిగినట్టు అబద్ధం చెప్పినట్టు- ఒప్పుకుంది. పోలీసులు లీగల్ ఒపీనియన్ తీసుకుని, ఎటు-వంటి అత్యాచారం జరగలేదని నిర్ధారించి కేసును మూసివేశారు.

## నయా కోవర్ట్..

అమరావతి,వైఎస్ కుటుంబంతో తనకు మూడు తరాలుగా విడదీయరాని అనుబంధం ఉన్నదని ఆయన చాలా ఘనంగా చెప్పుకుంటారు. జగన్ మాత్రమే కాదు.. రాజారెడ్డి, రాజశేఖర రెడ్డి కూడా తనకు ఎంతో ఆత్మీయులని చాటుకుంటారు. ఆయన నిన్నటిదాకా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ లో ఒక్క వెలుగు వెలిగారు. ఎంతగా అంటే.. ఆయన చెబితే.. జగన్మోహన్ రెడ్డి చెప్పినట్టే.. అని పార్టీలోని ఎంతటి సీనియర్ నాయకులు కూడా శిరసావహించే స్థాయిని అనుభవించారు. పార్టీలో కింగ్ పిన్ గా చక్రం తిప్పారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అంటే.. జగన్ తర్వాత తానే అన్నంతగా హవా చెలాయించారు. ఎందుకోగానీ.. ఆయనకు ఒక్కసారిగా పార్టీ చేదుగా అనిపించింది. జగన్మోహన్ రెడ్డితో మైత్రి కూడా విషంలా అనిపించింది. సాధారణంగా నాయకులు తమను పార్టీలు లూప్ లైన్లో పెట్టేసిన తర్వాత రాజీనామా చేస్తుంటారు. కానీ, ఆయన మాత్రం నెత్తిన పెట్టుకున్న పార్టీకి రాజీనామా చేసి, రాజ్యసభ ఎంపీ పదవిని కూడా వదులుకున్నారు. సేద్యం చేసుకుంటాను.. రాజకీయాల జోలికి రాను అని ప్రకటించారు. కానీ.. వాస్తవాన్ని జాగ్రత్తగా గమనిస్తే.. ఆయన ఇప్పుడిప్పుడే 'సేద్యం చేసుకునే మాజీ నాయకుడు' అనే ముసుగును తొలగించి.. ఎన్డీయే కూటమి పార్టీల కోవర్టు అవతారాన్ని బయటపెట్టుకుంటున్నారు అని అనిపిస్తోంది. ఆయనే విజయసాయిరెడ్డి! లిక్కర్ వ్యాపారం విషయంలో జగన్ సర్కారు ఏర్పడిన తర్వాత కొత్త పాలసీ తీసుకువచ్చింది. ఎలాంటి అవకతవకలు జరగకూడదనే ఉద్దేశంతోనే దుకాణాలన్నింటినీ ప్రభుత్వ పరంగానే నిర్వహించారు. కానీ కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత వైఎస్ జగన్ లిక్కర్ పాలసీ ద్వారా పెద్దఎత్తున అవినీతికి పాల్పడ్డారని ఆరోపణలతో కేసులు నమోదుచేశారు. ఎన్నికల ప్రచార సమయంలో లిక్కర్ వ్యాపారంలో 30వేల నుంచి 50 వేల కోట్ల వరకు జగన్ కాజేశారని ఆరోపణలు చేసిన వారు కాస్తా.. అధికారంలోకి వచ్చిన తర్వాత.. మూడువేల కోట్ల అవినీతి జరిగినట్టు లెక్కలు తయారుచేశారు. కసిరెడ్డి రాజశేఖర రెడ్డిని నిందితుడిగా చూపించి.. విచారణకు ప్రయత్నిస్తున్నారు. ఆయన అందుబాటులోకి రాకుండా పరారీలో ఉన్నారు. ఆయన ద్వారా వైసీపీలోని ప్రముఖుల పేర్లను కూడా చెప్పించి.. వారందరినీ కేసులో ఇరికించాలనే వ్యూహంతో అడుగులు వేస్తున్నారు. ఈ సమయంలో కసిరెడ్డి దొరక్కపోగా.. మరోవైపు ఆ కేసుతో సంబంధం లేని, కేసులో కనిపించని.. మాజీ ఎంపీ విజయసాయిరెడ్డిని సాక్షిగా వచ్చి వివరాలు చెప్పాలంటూ నోటీసులు పంపారు. సో, సాక్షిగా ఇప్పుడు విజయసాయిరెడ్డి సిట్ విచారణకు హాజరుకాబోతున్నారు .విజయసాయి రెడ్డి ఇటీవల మీడియాతో మాట్లాడుతూ మద్యం కుంభకోణం గురించి అనేక సంగతులు అన్నారు. తాను పార్టీకి రాజీనామా చేసిన సమయంలో.. ఇకమీదట రాజకీయాల్లో ఉండను, మాట్లాడను అని సెలవిచ్చిన విజయసాయి.. ఆ సందర్భంలో మద్యంకుంభకోణం గురించి..

# 2వ స్థానం నుంచి 2 వేల స్థానానికి పడిపోయా...



అమరావతి,ఏపీలో మద్యం కుంభకోణం విచారణ కోసం ఏర్పాటు అయిన ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) విచారణకు హాజరైన వైసీపీ మాజీ నేత, మాజీ ఎంపీ వేణుంబాక విజయసాయిరెడ్డి శుక్రవారం సంచలన వ్యాఖ్యలు చేశారు. ఈ కుంభకోణం మొత్తం ప్రభుత్వ మాజీ సలహాదారు కసిరెడ్డి రాజశేఖరరెడ్డి అలియాస్ రాజ్ కసిరెడ్డి నేతృత్వంలోనే జరిగిందని ఇదివరకే చెప్పిన మాటను సాయిరెడ్డి శుక్రవారం కూడా మరోమారు వినిపించారు. మద్యం కుంభకోణం మొత్తాన్ని రాజ్ కసిరెడ్డే నడిపించారని ఆయన తేల్చిచెప్పారు. అయితే ఈ వ్యవహారంలో వైసీపీ ఎంపీ పెద్దిరెడ్డి వెంకట మిథున్ రెడ్డికి సంబంధం ఉందా? లేదా? అన్నది తనకు తెలియదన్న సాయిరెడ్డి ఆ విషయాన్ని మిథున్ రెడ్డినే అడగాలని వ్యాఖ్యానించారు. శుక్రవారం మధ్యాహ్నం విజయవాడ పోలీస్ కమిషనరేట్ లోని సిట్ కార్యాలయానికి వెళ్లిన సాయిరెడ్డిదాదాపుగా 3 గంటల పాటు సిట్ అధికారులు అడిగిన ప్రశ్నలకు సమాధానం చెప్పారు. అనంతరం బయటకు వచ్చిన ఆయన అక్కడే మీడియాతో మాట్లాడారు. ఈ సందర్భంగా రాజ్ కసిరెడ్డిని ఆయన తెలివైన క్రిమినల్ గా అభివర్ణించారు. అంతటి క్రిమినల్ మైండెడ్ వ్యక్తిని తానెప్పుడూ చూడలేదన్న సాయిరెడ్డి%ా%కసిరెడ్డిని పార్టీలోని కొందరు నేతలు తనకు పరిచయం చేయగా అతడి మనస్తత్వం తెలియక తానే అతడి ఎదుగుదలకు తోడ్పాటు అందించానని ఆవేదన వ్యక్తం చేశారు. ఇంతటి పెద్ద కుంభకోణానికి పాల్పడ్డ కసిరెడ్డి తనను ఓ రకంగా మోసం చేసినట్టేనని కూడా సాయిరెడ్డి అన్నారు. అయితే ఈ మోసం వల్ల తానేమీ కోల్పోలేదని కూడా ఆయన వ్యాఖ్యానించారు.వైసీపీ అధికారంలోకి వచ్చాక 2019 చివరలో హైదరాబాద్ లోని జర్నలిస్టు కాలనీ పరిధిలో ఉన్న తన ఇల్లు, ఆ తర్వాత విజయవాడలో తన నివాసం ఉంటున్న విల్లాలో రెండు సార్లు సమావేశాలు జరిగాయని, ఈ సమావేశాల్లో నూతన మద్యం పాలసీపై చర్చలు జరిగాయని సాయిరెడ్డి తెలిపారు. ఈ సమావేశాల్లో రాజ్ కసిరెడ్డి, మిథున్ రెడ్డి, సత్య ప్రసాద్, తాను పాలుపంచుకున్నామని తెలిపారు. అయితే ఈ సమావేశాలకు నాడు సీఎం సెక్రటరీగా వ్యవహరించిన ధనుంజయ్ రెడ్డి గానీ, ఓఎస్డీ కృష్ణమోహన్ రెడ్డి గానీ హాజరు అయినట్టుగా తనకు గుర్తు లేదన్నారు. దీనిపై గుర్తు చేసుకుని అలాంటిదేదైనా ఉంటే తర్వాత తెలియజేస్తానని సిట్ అధికారులకు చెప్పానన్నారు. ఈ సమావేశం అనంతరం రాజ్ కసిరెడ్డి, మిథున్ రెడ్డిలు తనను రూ.100 కోట్ల రుణం ఇప్పించమని అడిగితే%ా% అరబిందో శరత్ చంద్రారెడ్డి చేత ఇప్పించానని తెలిపారు.

# వైఎస్ జగన్‌కు కేసులో ఈడీ దూకుడు

న్యూఢిల్లీ,మాజీ ముఖ్యమంత్రి, వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డికి ఈడీ బిగ్ షాక్ ఇచ్చింది. జగన్‌కు సంబంధించిన దాదాపు రూ.800 కోట్ల విలువైన ఆస్తులను ఈడీ అటాచ్ చేసింది. 14 ఏళ్లుగా కొనసాగుతున్న మనీలాండరింగ్ కేసులో రూ. 800 కోట్ల విలువైన భూములు, షేర్లను ఈడీ జప్తు చేసింది. 2009 - 2010 కాలంలో నమోదైన అవినీతి ఆరోపణలకు సంబంధించిన కేసులో ఈడీ చర్యలు తీసుకుంది. జగన్ మోహన్ రెడ్డి ఎంపీగా ఉన్న సమయంలో, ఆయన కంపెనీలకు లాభాలు కలిగించారని దానికి బదులుగా వ్యాపార సంస్థల నుంచి లాభాలు పొందారని ఆరోపణలు ఉన్నాయి. హైదరాబాద్, బెంగళూరు వంటి నగరాల్లో ఉన్న భూములు, కొన్ని కంపెనీలలో ఉన్న వాటాలను ఈడీ అటాచ్ చేసినట్టు సమాచారం. ఈ ఆస్తులు జగన్ రెడ్డి వ్యక్తిగతం కంటే ఎక్కువగా ఆయన కుటుంబం, సంబంధిత కంపెనీలు, సహచరుల పేరిట ఉన్నట్లు అధికారులు గుర్తించారు. ఇప్పటికే ఈ కేసులో సీబీఐ కూడా విచారణ కొనసాగిస్తోంది. అనేక అవినీతి కేసులో జగన్ ఏ1గా ఉన్నారు. ఆయనపై దాదాపు 14 కేసులు నమోదు అయ్యాయి. ఈ కేసులకు సంబంధించి గతంలో జైలులో దాదాపు 16 నెలల పాటు శిక్ష అనుభవించారు. ఇప్పుడు తాజాగా ఆ కేసులకు సంబంధించి ఈడీ దూకుడు పెంచింది. జగన్‌కు సంబంధించి ప్రస్తుతం రూ.800 కోట్ల విలువైన ఆస్తులను ఈడీ జప్తు చేసింది. 2009- 2010- 2011 మూడు సంవత్సరాల్లో నమోదైన సీబీఐ కేసులను ఆధారంగా చేసుకుని దాదాపు 12 సంవత్సరాలుగా ఈడీ కూడా దర్యాప్తు కొనసాగిస్తోంది. జగన్ కంపెనీలు, బినామీలు మనీలాండరింగ్‌కు పాల్పడ్డారనే అభియోగాలను సీబీఐ గతంలో మోపింది. సీబీఐ నమోదు చేసిన ఎఫ్ఐఆర్‌ను ఆధారంగా చేసుకుని ఈడీ అధికారులు ఈసీఐఆర్ నమోదు చేసి విచారణ కొనసాగించారు. 14 ఏళ్ల తర్వాత రూ.800 కోట్ల విలువైన ఆస్తులను ఈడీ జప్తు చేసింది.పునీత్



దాల్మియా కంపెనీకి చెందిన రూ.793 కోట్లు- జప్తు చేసినట్లు- ఈడీ అధికారులు అధికారికంగా ప్రకటించారు. గతంలో కడప జిల్లాలో అక్రమంగా సున్నపురాయి గనులను పునీత్ దాల్మియా కంపెనీకి కట్టబెట్టడం, వారికి లాభాలు చేకూరడంతో ఆ కంపెనీ నుంచి డబ్బులు తీసుకున్నారనే విషయాన్ని సీబీఐతో పాటు- ఈడీ కూడా విచారణలో వెల్లడించింది. భారతీ సిమెంట్స్ క్విడ్ ప్రోకోకు పాల్పడిందంటూ గతంలో సీబీఐ తన చార్జ్‌షీట్‌లో స్పష్టం చేసింది. ఈడీ అధికారులు కూడా అదే అంశాన్ని స్పష్టం చేశారు. బినామీల పేరుపై ఉన్న ఆస్తులు, క్విడ్ ప్రోకు పాల్పడ్డాక లబ్ది పొందిన కంపెనీలకు చెందిన ఆస్తులను కూడా ఈడీ జప్తు చేసింది. కడప జిల్లాలో ఉన్న సున్నపురాయి గనులను దాల్మియా సిమెంట్స్‌కు కట్టబెట్టడం, వారికి లబ్ది చేకూర్చే విధంగా అప్పటి ఎంపీ జగన్ వ్యవహరించారని ప్రస్తుతం ఈడీ అధికారులు విచారణలో వెల్లడించారు. 2011లో కేసు నమోదు చేసిన సీబీఐ 2013లో చార్జ్‌షీట్ ఫైల్ చేసింది. ఛార్జ్‌షీట్‌లో ఎన్నో ముఖ్యవిషయాలను ప్రస్తావించింది సీబీఐ. భారతీ సిమెంట్స్‌లో దాల్మియా సిమెంట్స్ పెట్టుబడి పెట్టిందని సీబీఐ విచారణలో వెల్లడించింది.

# కాంగ్రెస్‌లో విస్తరణం...




హైదరాబాద్: అధికార కాం గ్రెస్‌లో అసమ్మతి రాజుకుంటోంది. మంత్రివ ర్గ విస్తరణ అంశం ఆ పార్టీ నేతల్లో అసహనానికి దారితీస్తున్నది. మంత్రి విస్తరణ ఆలస్యం అవుతుండటంతో ఆశావహుల మధ్య మాట ల తూటాలు పేలుతున్నాయి. కాంగ్రెస్ పార్టీ లో అసమ్మతి స్వరాలు పెరుగుతున్న నేపథ్యంలో మంత్రివర్గ విస్తరణ రాష్ట్ర రాజకీయాలలో హాల్ టాపిక్‌గా మారింది. కేబినెట్ విస్తరణ ఆలస్యం కావడం పట్ల కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి, ప్రేమ్‌సాగర్‌రావు,మల్‌రెడ్డి రం గారెడ్డి, వివేక్ వెంకటస్వామి ఇప్పటికే తమ అసంతృప్తి వ్యక్తం చేయగా.. తాజాగా మరికొందరు అదేబాట పట్టారు. మంత్రివర్గ విస్తరణ విషయంలో తనకు మంత్రిపదవి రాకుం డా సీనియర్ నేత జానారెడ్డి అడ్డుకున్నారం టూ మునుగోడు ఎంఎల్‌ఎ కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలు కాంగ్రెస్ పార్టీ లో తీవ్ర దుమారాన్ని లేపాయి. అదే విధంగా చెన్నూరు ఎంఎల్‌ఎ వివేక్ వెంకటస్వామి కుటుంబంపై మంచిర్యాల ఎంఎల్‌ఎ ప్రేమ్‌సాగర్ రావు చేసిన వ్యాఖ్యలు, తనకు మంత్రి పదవి దక్కకపోతే తీవ్ర పరిణామాలు ఉంటాయన్న ఆయన వ్యాఖ్యలు కలకలం రేపాయి.హెలికాప్టర్ లేకుండా నల్లగొండ మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి బయట అడుగు పెట్టడం లేదని మరో మంత్రి దామోదర రాజనర్సింహ వ్యాఖ్యానించడం, తనకు మంత్రిపదవి దక్కకపోతే తాను కాం గ్రెస్ రాజీనామా చేస్తానని ఇబ్రహీంపట్నం ఎంఎల్‌ఎ మల్‌రెడ్డి రంగారెడ్డి చేసిన వ్యాఖ్యలు తీవ్ర చర్చకు దారితీసింది. తాను పార్టీ మారుతున్నట్లు జరుగుతున్న ప్రచారాన్ని కాంగ్రెస్ సీనియర్ నేత జీవన్ రెడ్డి కొట్టిపారేశారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో తాను దశాబ్దకాలం ఒంటరిగా పోరాటం చేశానని, కాంగ్రెస్ అంటే జీవన్ రెడ్డి అనే విధంగా జిల్లాలో పార్టీని బలోపేతం చేశానని అన్నారు. తెలంగాణ కాంగ్రెస్ పార్టీలో వి.హనుమంతరావు తర్వాత తానే సీనియర్ నాయకుడినని, జానారెడ్డి కూడా తన కంటే నాలుగేళ్ల తర్వాత పార్టీలోకి వచ్చారని వెల్లడించారు. అయితే పార్టీలో సీనియారిటీకి స్థానం ఏమిటనే బాధ తనలో ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. కొందరు సీనియర్లు వారి అభిప్రాయాలను మాట్లాడి ఉండవచ్చని అన్నారు.

కొనసాగుతున్న వాయిదాల పర్వం

రాష్ట్రంలో మంత్రివర్గ విస్తరణలో వాయిదాల పర్వం కొనసాగుతూనే ఉంది. గత 16 నెలలుగా మంత్రివర్గ విస్తరణపై కొనసాగుతున్న ఉత్కంఠకు.. హైకమాండ్ తెరదించబోతోందనుకుంటే, ఆశావహులకు మరోసారి నిరాశే ఎదురవుతోంది. పరిస్థితులు అనుకూలంగా లేకపోవడంతో.. విస్తరణ ప్రక్రియను కొన్నాళ్లు వాయిదా వేయడమే మంచిదని ఎఐసిసి భావిస్తున్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం రాష్ట్ర మంత్రిమండలిలో మరో ఆరుగురికి అవకాశం ఉండగా, ఆశావహుల సంఖ్య మాత్రం అందుకు రెండింతలు ఉన్నట్లు సమాచారం. జిల్లాలు, సామాజిక సమీకరణలు బేరీజు వేసుకుని ఆరు మంత్రి పదవులు కేటాయించడం కాంగ్రెస్ అధిష్టానానికి ఇబ్బందిగా మారింది. అందుకే ఈ వ్యవహారంలో మంత్రివర్గ విస్తరణ విషయంలో కాంగ్రెస్ పెద్దలు ఆచితూచి వ్యవహరిస్తున్నట్టు తెలుస్తోంది.కేబినెట్‌లో సామాజిక సమతుల్యత కీలకంగా మారినట్లు తెలుస్తోంది. బిసి,ఎస్‌సి, ఎస్‌టి సామాజిక వర్గాలకు చెందిన ఎంఎల్‌ఎలు తమ సామాజికవర్గానికి అవకాశం కల్పించాలని కోరుతూ ఇప్పటికే కాంగ్రెస్ అధిష్టానానికి లేఖలు రాశారు. దాంతో మంత్రివర్గ విస్తరణను మరింత సంక్లిష్టంగా మారినట్లు సమాచారం. వాకిటి శ్రీహరి, ఆది శ్రీనివాస్‌ల పేర్లు బిసి సామాజిక వర్గం నుంచి పరిశీలనలో, ఎస్‌సి మాదిగ సామాజిక వర్గం నుంచి అడ్లూరి లక్ష్మణ్, లంబాడా సామాజికవర్గం నుంచి బాలు నాయక్ మంత్రి పదవి కోసం తీవ్ర ప్రయత్నాలు చేసినట్లు తెలిసింది. ఇలా ఎంఎల్‌ఎలు కాంగ్రెస్ హైకమాండ్‌కు లేఖలు రాయడంతో పాటు ప్రాంతాలవారీగా విడిపోయి, తమకు అవకాశం ఇవ్వాలంటూ ఢిల్లీ వెళ్లి మరీ విజ్ఞాపనలు అందజేశారు. కాగా, ఆరు మంత్రి పదవుల్లో ఒకటి మైనారిటీలకు కేటాయించాలని అధిష్టానం భావించినట్లు సమాచా రం. మిగిలిన ఐదు మంత్రి పదవులకు మూడింతల ఆశావహులు ఉండటంతో మంత్రివర్గ విస్తరణ వాయిదా వేసినట్టు ప్రచారం జరుగు తోంది.

# మజ్లిస్ పార్టీ ఉచ్చులో కాంగ్రెస్,బిఆర్ఎస్



హైదరాబాద్, ప్రజలను దోపిడీ చేసి.. ఆడబిడ్డలపై అఘాయిత్యాలకు పాల్పడి.. ప్రజల రక్తం తాగిన మజ్లిస్ పార్టీకి కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు జీ హుజూరంటున్నాయని కేంద్ర మంత్రి, తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు జి.కిషన్ రెడ్డి మండిపడ్డారు. ఈ మేరకు కాంగ్రెస్, బీఆర్ఎస్, మజ్లిస్ పార్టీలపై కిషన్ రెడ్డి విర్శలు గుప్పించారు. ఈ మూడు పార్టీలు కలిసి తెలంగాణను ముంచే ఎత్తుగడలు వేస్తున్నాయని ఆయన ఆరోపించారు. శుక్రవారం బేగంపేట హరిత ప్లాజాలో జరిగిన హైదరాబాద్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల సన్నాహక సమావేశంలో కేంద్ర మంత్రి జి. కిషన్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని.. పార్టీ నాయకులు, శ్రేణులను ఉద్దేశించి ప్రసంగించారు. హైదరాబాద్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు ఎందుకు పోటీ- చేయడం లేదో ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. మజ్లిస్ పార్టీకి వంగి వంగి సలాం కొడుతున్న రాహుల్ గాంధీ, కేసీఆర్‌లకు బీజేపీని విమర్శించే నైతిక హక్కు లేదని స్పష్టం చేశారు. రజాకార్ల వారసత్వాన్ని పొందిన మజ్లిస్ పార్టీకి వ్యతిరేకంగా జాతీయ వాద భావనతో బీజేపీ పోటీ- చేస్తోందని వివరించారు. మజ్లిస్ పార్టీ,రజాకార్లకు వ్యతిరేకంగా పోరాటం చేసిన స్వాతంత్య్ర సమరయోధులు, ఉద్యమకారుల వారసత్వాన్ని బీజేపీ కొనసాగిస్తోందని గుర్తు చేశారు. మజ్లిస్ పాత బస్తీకే మాత్రమే పరిమితం కాలేదని.. ఆ పార్టీ ప్రస్తుతం తెలంగాణలో అన్ని అసెంబ్లీ నియోజకవర్గాల్లో చాప కింద నీరులా విస్తరిస్తోందంటూ ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. బీజేపీని ఓడించాలనే లక్ష్యంతో కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు మజ్లిస్ పార్టీకి విజయాన్ని కట్టబెట్టేందుకు ప్రయత్నిస్తున్నాయని ఆయన ఆరోపించారు. ఈ మూడు పార్టీలు ఒకే తానుముక్కలుగా కలిసి పని చేస్తున్నాయన్నారు. ఈ ఎన్నికల్లో మజ్లిస్‌ను గెలిపించేందుకు కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు కుట్రలు చేస్తున్నాయని విమర్శించారు. తెలంగాణ ప్రజలు చైతన్యంగా ఆలోచించక పోతే,మళ్లీ రజాకార్ల పాలన లాంటి పరిస్థితులు దాపురించే ప్రమాదం ఉందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. మజ్లిస్ పార్టీ నాయకులు.. పాత బస్తీలోని హిందువుల ఇళ్లను స్వాధీనం చేసుకుని ప్రజలను ఖాళీ చేయించిన ఘటనలు చాలానే ఉన్నాయన్నారు. తెలంగాణను, హైదరాబాద్‌ను బలి చేసేందుకు కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు వెనుకాడడం లేదన్నారు. ప్రజలను జాగృతం చేయాలనే పవిత్ర ఉద్దేశంతోనే హైదరాబాద్ స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ పోటీ- చేస్తోందని చెప్పారు. మాకు గెలుపు ఒక్కటే ముఖ్యం కాదని.. హైదరాబాద్‌ను రక్షించడం కూడా ప్రధాన లక్ష్యమని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి స్పష్టం చేశారు. మజ్లిస్ పార్టీ మతోన్మాదం, గూండాయిజాన్ని ఎదుర్కొంటూ బీజేపీ ధర్మయుద్ధం చేస్తోందన్నారు. బీఆర్ఎస్ హయాంలో హైటెక్ సిటీ-లో రంగులు వేసి అభివృద్ధి అంటూ ప్రచారం చేశారు. కానీ అభివృద్ధి పేరు చెప్పి ఎక్కడైతే రియల్ ఎస్టేట్ వ్యాపారం ఎక్కువ ఉందో అక్కడే పనులు జరిగాయని ఆరోపించారు. ఇరు-కై-న రోడ్లు సైతం నిర్మించారన్నారు. జీహెచ్ఎంసీ స్థితి దారుణంగా మారిందని.. వీధిలైట్లు- కొనడానికి డబ్బుల్లేని స్థితికి దిగజారి పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ పనితీరు అసమర్థంగా ఉందని.. పౌర సేవల మెరుగుదలకు నిధులు సైతం పెరగడం లేదన్నారు. మజ్లిస్ పార్టీ నుంచి నగరాన్ని రక్షించాలంటే.. చైతన్యంతో ఓటు- వేయాలని ప్రజలకు ఆయన సూచించారు. తెలంగాణలో డబుల్ ఇంజిన్ ప్రభుత్వం వచ్చినపుడే నిజమైన అభివృద్ధి సాధ్యమవుతుందని ఆయన పేర్కొన్నారు.కాంగ్రెస్ నాయకులు విదేశీ పెట్టు-బడుల గురించి చెబుతున్నారు..కానీ అవి ఎక్కడికి వెళ్లాయని ప్రశ్నించారు. మోదీ ప్రభుత్వం వచ్చిన తర్వాత ఆర్థిక, పన్నుల సంస్కరణలు ఉగ్రవాదం, మతోన్మాదాన్ని అరికట్టడంతోపాటు- సమర్థవంతమైన విదేశాంగ విధానం.. ఇలా అన్నింటిలో ప్రగతి కనిపిస్తోందని చెప్పారు. గతంలో విద్యుత్ కోసం రైతులు మోటార్ల దగ్గర నిద్రించాల్సి వచ్చేదని..మోదీ పాలనలో విద్యుత్ కోతల్లేని దేశంగా మారిందన్నారు. సనత్ నగర్,మల్కాజ్‌గిరి,దిల్‌సుఖ్‌నగర్, గౌలిపుర,చార్మినార్,నాంపల్లి, సోమాజిగూడ, ఖైరతాబాద్,కూకట్ పల్లి తదితర ప్రాంతాల్లో ప్రజల సౌకర్యాలు మెరుగుపరచాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. హైదరాబాద్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి గౌతం రావు గారిని గెలిపించేందుకు ప్రతి కార్యకర్త ఐకమత్యంగా కృషి చేయాలని ఆయన పిలుపు నిచ్చారు. మజ్లిస్ పార్టీ ఇప్పుడేం ఓల్డ్ సిటీ-కి మాత్రమే పరిమితం కాలేదని, తెలంగాణ వ్యాప్తంగా విస్తరిస్తూ కుట్రలు చేస్తున్నదని ఆయన ఆరోపించారు.

# దక్షిణాదిన బలోపేతానికి బీజేపీ వ్యూహం!

న్యూఢిల్లీ,దక్షిణాది రాష్ట్రాల్లో పార్టీ బలోపేతంపై బీజేపీ దృష్టి సారించింది. ఉత్తరాదిన పాగా వేసిన బీజేపీకి దక్షిణాది కొరుకుడు పడటం లేదు. ఒక్క కర్నాటక వినా మరే దక్షిణాది రాష్ట్రంలోనూ ఆ పార్టీ ప్రజాదరణ పొందలేదు. దీంతో దక్షిణాదిలో పార్టీ పటిష్ఠతే లక్ష్యంగా కొత్త కొత్త వ్యూహాలు, ప్రణాళికలూ రచిస్తోంది. ఒక వైపు దక్షిణాది రాష్ట్రాలలో ప్రాంతీయ పార్టీలతో పొత్తులో కొనసాగుతూనే సొంతంగా బలోపేతం కావడానికి ప్రయత్నాలు సాగిస్తున్నది. దక్షిణాది రాష్ట్రాలలో బీజేపీ బలోపేతానికి జనసేన అధినేత పవన్ కల్యాణ్ చరిష్మాపై ఆధారపడటం అవసరమన్న నిర్ణయానికి వచ్చిన బీజేపీ అందుకు అనుగుణంగా అడుగులు వేస్తున్నది. వ్యూహరచన చేస్తున్నది. ఇందు కోసం ఆంధ్రప్రదేశ్ ను సెంట్రిక్ గా చేసుకుని తమిళనాడులో పాగా వేయాలన్నది ఆ పార్టీ వ్యూహంగా కనిపిస్తోంది. ఏపీలో తెలుగుదేశం కూటమిలో భాగస్వామ్య పార్టీగా కొనసాగుతూనే పవన్ కల్యాణ్ తోడ్పాటుతో సొంత బలం పెంచుకోవాలని భావిస్తున్నది. భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ను దగ్గర చేసుకోవడానికి ఇప్పటికే ప్రయత్నాలు ప్రారంభించింది. ఇప్పటికే ఏపీలో హిందుత్వకు బ్రాండ్ అంబాసిడర్ గా పవన్ కల్యాణ్ తనను తాను ఫోకస్ చేసుకుంటున్నారు. అదే సమయంలో బీజేపీ కూడా పవన్ కు అత్యంత ప్రాధాన్యత ఇస్తోంది. అంతే కాకుండా కేంద్ర కేబినెట్ విస్తరణకు కసరత్తు చేస్తున్న మోడీ, తన కేబినెట్ లో జనసేన అధినేత పవన్ కు బెర్త్ ఆఫర్ చేసినట్లు బీజేపీ సన్నిహిత వర్గాల సమాచారం. పవన్ అందుకు అంగీకరించి.. కేంద్ర కేబినెట్ లోకి వెడితే.. ఏపీలో ఆయన సోదరుడు నాగబాబుకు కీలక కేబినెట్ బెర్త్ దక్కేలా తన ఇన్ ఫ్లుయెన్స్ ను ఉపయోగించాలన్నది బీజేపీ ఎత్తుగడగా కనిపిస్తోంది. అలా కాకుండా పవన్ ఏపీ కేబినెట్ లో నంబర్ 2గా, అంటే ఉప ముఖ్యమంత్రిగా కొనసాగడానికే మొగ్గు చూపితే.. ఆయన సేవలను తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల ప్రచారానికి విస్తృతంగా వినియోగించుకోవాలని యోచిస్తోంది. ఆంధ్రప్రదేశ్ లో కంటే తమిళనాట.. సినీ గ్లామర్ ప్రభావం రాజకీయాలపై అధికంగా ఉంటుందన్న సంగతి తెలిసిందే. అందుకే ఇప్పటికే



పవన్ బీజేపీ కోరిక మేరకు తమిళనాడుకు సంబంధించినంత వరకూ వ్యూహాత్మకంగా అక్కడ అధికారంలో ఉన్న డీఎంకేకు వ్యతిరేకంగా వ్యాఖ్యలు చేస్తూ వస్తున్నారని చెబుతున్నారు. ఇక తెలుగుదేశం పార్టీకి కూడా బీజేపీ తాయిలాలు ఇచ్చి.. కేంద్రంలో మోడీ సర్కార్ కు ఎటువంటి ఇబ్బందులూ తలెత్తకుండా ఉండేలా జాగ్రత్తలు తీసుకుంటోంది. సాధ్యమైనంత త్వరలో పలు రాష్ట్రాలకు గవర్నర్ల నియామకం చేయాలన్న ఉద్దేశంతో ఉన్న బీజేపీ.. తెలుగుదేశం పార్టీ నుంచి ఒకరిద్దరికి గవర్నర్ పదవి ఇవ్వాలని నిర్ణయించింది. ఈ మేరకు ఇప్పటికే చంద్రబాబుకు సమాచారం ఇచ్చినట్లు చెబుతున్నారు. పార్టీ నుంచి ఎవరిని ఎంపిక చేయాలన్న విషయంలో చంద్రబాబు ఇప్పటికే కసరత్తు మొదలెట్టారని కూడా తెలుస్తోంది. మొత్తం మీద దక్షిణాదిలో బలపడటం కోసం బీజేపీ పూర్తిగా ఆంధ్రప్రదేశ్ పైనే ఆధారపడి ఉందన్న చర్చ జోరుగా సాగుతోంది. జనసేన, తెలుగుదేశం పార్టీలతో సఖ్యత కొనసాగిస్తూనే ఆ రెండు పార్టీల తోడ్పాటుతో తెలంగాణ, తమిళనాడు రాష్ట్రాలలో పాగా వేయాలన్నది బీజేపీ వ్యూహంగా చెబుతున్నారు.

# బిజెపిలో మారుతున్న సమీకరణాలు

న్యూఢిల్లీ, బిజెపి తదుపరి అధ్యక్షుడి ఎంపికపై బిజెపి ఇంకా స్పష్టత ఇవ్వకున్నా.. సమర్థ నేత అన్వేషణలో ఉన్నట్లు తెలుస్తోంది. దక్షిణ్యాదికి చెందిన, బలహీనవర్గాలకు చెందిన నాయకుడిని ఎంపికచేసే పనిలో ఉన్నట్లు దేశ రాజధానిలో వార్తలు ప్రచారం అవుతున్నాయి. బిజెపి జాతీయ అధ్యక్షుడితో పాటు, పలు రాష్ట్రాల అధ్యక్షులను నియమించాల్సి ఉంది. సామాజజిక సమీకరణాలు కూడా ముఖ్యమే. అన్నింటికీ మించి ఆర్ఎస్ఎస్ భావజాలానికి దగ్గరగా ఉన్న సమర్థ నేత కూడా అవసరమే. ఈ క్రమంలో గతంలో శివరాజ్ సింగ్ చౌహాన్ పేరు బలంగా వినిపించింది. మధ్యప్రదేశ్ సిఎంగా బలమైన ముద్ర వేసారు. ఇప్పుడు కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రిగా మంచిపేరు తెచ్చుకున్నారు. ఆయనపట్ల ఆర్ఎస్ఎస్‌కు వ్యతిరేకత ఉండకపోవచ్చు. ఇదంతా ఒక ఎత్తయితే దక్షిణాదిలో పార్టీని బలోపేతం చేసుకునే దిశగా బిజెపి అడుగులు వేస్తోంది. ఈ క్రమంలో ఇటీవల ఆర్ఎస్ఎస్ ప్రధాన కార్యాలయాన్ని మోడీ సందర్శించడం కూడా ప్రాధాన్యత సంతరించుకుంది. ఈ క్రమంలో త్వరలో భారతీయ జనతా పార్టీలోనూ, ప్రభుత్వంలోనూ కీలక మార్పులు జరగనున్నట్లు రాజకీయ ప్రచారం సాగుతోంది. మరో వారం పది రోజుల్లో బీజేపీకి జాతీయ అధ్యక్షుడు రానున్నారు. పార్టీపై పూర్తిగా పట్టుబిగించి ప్రభుత్వానికి దిశానిర్దేశర చేయనున్న బలమైన నేతనే పార్టీ అధ్యక్షుడుగా నియమించే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఈ మేరకు రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ నేతలకు, బీజేపీ అగ్రనేతలకు మధ్య చర్చ సాగిందన్న ప్రచారం కూడా ఉంది. ఈ క్రమంలోనే బలమైన నేత అన్వేషణలో ఉన్నట్లు సమాచారం. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, గుజరాత్, ఉత్తరప్రదేశ్, కర్ణాటక, పశ్చిమ బెంగాల్, హరియాణా సహా పలు రాష్ట్రాలకు పార్టీ అధ్యక్షులను కూడా నియమించాల్సి ఉంది. పార్టీలో సిద్ధాంతానికి కట్టుబడి ఉండే నేతలను ప్రధాన కార్యదర్శులుగా, కార్యదర్శులుగా నియమించే అవకాశాలు ఉన్నట్టు తెలుస్తోంది. మరోవైపు.. ప్రధాని మోదీ పూర్తిస్థాయి మంత్రివర్గ పునర్వ్యవస్థీకరణ జరపనున్నట్లు పార్టీ వర్గాల్లో ప్రచారం ఉంది. పార్టీలో సుదీర్ఘకాలం పనిచేస్తున్నవారికి అవకాశం కల్పించనున్నట్లు ఆ




వర్గాలు వెల్లడించాయి. పార్టీలోనూ, మంత్రివర్గంలోనూ యువనేతలకు కూడా కీలక ప్రాధాన్యం కల్పించనున్నట్లు- తెలిసింది. నాలుగైదు రాష్ట్రాల్లో గవర్నర్లను కూడా మార్చే అవకాశాలు లేకపోలేదు. మరోవైపు హోంమంత్రి అమిత్ షా కూడా పార్టీ అధ్యక్షుడు జేపీ నడ్డా, రక్షణమంత్రి రాజ్‌నాథ్ సింగ్, పార్టీ సంస్థాగత వ్యవహారాల ప్రధాన కార్యదర్శి బీఎల్ సంతోష్ తో చర్చలు జరిపారు. మోదీ కూడా వీరితో మంతనాలు జరిపినట్లు సమాచారం. తమిళనాడు బీజేపీ అధ్యక్షుడు అన్నామలైను కేంద్రంలోకి తీసుకునే అవకాశాలు ఉన్నాయి. ఆయన దక్షిణాదిలో,ముఖ్యంగా తమిళనాడులో ప్రభావంచూపే నేతగా ఎదిగారు. అన్నాడిఎంకేతో బీజేపీ జతకట్టడంతో ఆయన తమిళనాడు అధ్యక్ష బాధ్యతల నుంచి తప్పుకున్నారు. అన్నామలైను కేంద్ర మంత్రివర్గంలో చేర్చుకునే అవకాశం కూడా లేకపోలేదని పార్టీ వర్గాలు అంటున్నాయి.

## టిటిడి ప్రతిష్టను దిగజార్చకండి

అమరావతి: తిరుపతిలో గోశాలలో ఆవుల మృతిపై వైసీపీ, కూటమి నేతల మధ్య రాజకీయ దుమారం రేగింది. ఈ వివాదంపై సిపిఐ కార్యదర్శి నారాయణ స్పందించారు. అందరికి చేతులెత్తి జోడిస్తున్నాను, గోశాలను రాజకీయ లబ్ధి కోసం వాడుకోవద్దు. హైడ్రామా సృష్టించి భక్తుల మనోభావాలను దెబ్బతీయొద్దన్నారు. టీటీడీపై రాద్ధాంతం మానుకోండి.

Printed, Published and Owned by UPPUGALLA SANTHOSH KUMAR H.NO. 10-19/286/1, RAVINDRA NAGAR COLONY, NAGARAM VILLAGE, KEESERA MANDAL, DIST.RANGA REDDY, PIN -500083, TELANGANA, Printed at SRI SAI GRAPHICS 9-52/3, ROAD NO.8, S.V.NAGAR, NAGARAM KEESARA, DIST. RANGA REDDY, PIN -500083, TELANGANA . RNI No : TELTEL/2015/66279 Editor : UPPUGALLA SANTHOSH KUMAR Cell : +918247019090. Email : agranetha@gmail.com